ఆంధ్రజ్యోతి

ఉష్ణోగ్రతలు | గరిష్ఠం : 32.0 | కనిష్ఠం : 17.0

ANDHRAJYOTHY

5



నారాయణపేట
జిల్లా వార్తలు

బుధవారం 22 జనవరి 2025

జనరల్ ఆస్పత్రిలో ఉరేసుకొని
మహిళ ఆత్మహత్య
- చికిత్స కోసం వచ్చి బాత్‌రూమ్‌లో బలవన్మరణం
- దామరగిద్ద మండలం కందెన్‌పల్లి స్వగ్రామం 6


నేడు వైద్య,
ఆరోగ్యశాఖ మంత్రి రాక
- మహబూబ్‌నగర్, నారాయణపేట, వనపర్తి జిల్లాల్లో దామోదర పర్యటన 7



అన్నదాతకు
యంత్రసాయం
- వ్యవసాయ యాంత్రీకరణ పథకం పునరుద్ధరణ
- రైతుల్లో చిగురిస్తున్న ఆశలు 7



స్థానిక సందడి



- నారాయణపేట జిల్లాలో మొదలైన ఎన్నికల వేడి
- ప్రధాన నాయకుల ఆశీస్సుల కోసం ఆశావహుల పైరవీలు
- అధిక స్థానాలను కైవసం చేసుకునేందుకు పార్టీల ప్రయత్నాలు

నారాయణపేట జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల సందడి నెలకొంది. ఆశావహులు పోటీ కోసం పైరవీలు మొదలెట్టారు. గ్రామాల్లో పర్యటిస్తూ, ఓటర్లను పలుకరించడంతో పాటు అధినాయకులను ప్రసన్నం చేసుకునే పనిలో ఉన్నారు. అధికార పార్టీ ఎమ్మెల్యేలు, ప్రతిపక్ష నాయకులు నియోజకవర్గాల్లో తిరుగుతూ, ఎన్నికల కోసం నాయకులు, కార్యకర్తలను సమాయత్తం చేస్తున్నారు. సంక్షేమ పథకాల గురించి చెప్పాలని కాంగ్రెస్, ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీఆర్‌ఎస్ చెబుతుండగా.. కేంద్ర పథకాల గురించి చెప్పి పార్టీని బలోపేతం చేయాలని బీజేపీ అంటోంది.

నారాయణపేట, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల వేడి మొదలైంది. బరిలో నిలిచేందుకు ఆశావహులు నాయకుల చుట్టూ తిరుగుతుండగా, ఆయా పంచాయతీలలో తమ మద్దతుదారులను రంగంలోకి దింపి, మెజారిటీ స్థానాలు కైవసం చేసుకోవాలని ప్రధాన పార్టీలు పావులు కదుపుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా 280 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. 4,09,090 మంది ఓటర్లు ఉన్నారు. 1,412 బ్యాలెట్ బాక్సులు, 2,544 పోలింగ్ కేంద్రాలను అధికారులు సిద్ధం చేశారు.

కార్యక్రమాల్లో అధికార పార్టీ బిజీబిజీ

అధికార కాంగ్రెస్ పార్టీ విషయానికి వస్తే జిల్లాలోని ఎమ్మెల్యేలు వాకిటి శ్రీహరి, చిట్టెం పర్ణికారెడ్డిలు ఆయా నియోజకవర్గాల్లో విస్తృతంగా పర్యటిస్తూ, అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. అర్హులైన వారందరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూడాలని నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేస్తున్నారు. డీసీసీబీ మాజీ అధ్యక్షుడు, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కుంభం శివకుమార్ రెడ్డి వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. కోయిల్‌కొండ, మరికల్, ధన్వాడ, దామరగిద్ద, నారాయణపేట మండలాలకు సంబంధించి ఇటీవలే రెండు రోజులు ఎన్నికల సన్నాహక సదస్సులు నిర్వహించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా చూస్తూ, పార్టీ పటిష్టతతో పాటు మెజారిటీ స్థానాలు గెలిపించుకోవాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందని చెప్పారు. అంబేడ్కర్ గురించి కేంద్ర హోం మంత్రి అమిత్‌షా అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారని పార్టీ జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో గత డిసెంబరు 23న జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో నిరసన, కలెక్టరేట్ వరకు ర్యాలీ చేశారు. సీఎం సోదరుడు, కాంగ్రెస్ కొడంగల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి కోస్గి, మద్దూర్ మండలాల్లో కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు.

బీజేపీ కమిటీల ఎన్నిక

బీజేపీ పార్టీ రాష్ట్ర నాయకులు నాగురావు నామాజీ, రతంగ్ పాండురెడ్డి, కొండయ్య, జిల్లా స్థానిక సంస్థల ఎన్నికల ఇన్‌చార్జి చింతల రామచంద్రారెడ్డి పర్యవేక్షణలో పార్టీ మండల, పట్టణ కమిటీలను ఎన్నుకున్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు వివరించి, పార్టీ బలోపేతమే లక్ష్యంగా పని చేయాలని పిలుపునిస్తున్నారు. పార్టీ జిల్లా కమిటీ ఎన్నిక జరగాల్సి ఉంది. మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ జిల్లాలో పలు కార్యక్రమాల్లో పాల్గొంటూ, కార్యకర్తల్లో ఉత్తేజాన్ని నింపుతున్నారు.

బీఆర్‌ఎస్ నిరసన కార్యక్రమాలు

బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఎస్ఆర్‌రెడ్డి, మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి నియోజకవర్గంలో పర్యటిస్తూ, కార్యకర్తలకు అందుబాటులో ఉంటున్నారు. చిన్న చిన్న కార్యక్రమాలకు సైతం హాజరవుతున్నారు. రైతు భరోసా రూ.15 వేల నుంచి రూ.12 వేలకు తగ్గించడం తగదంటూ కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నియోజకవర్గ కేంద్రంలో బీఆర్‌ఎస్ నిరసన కార్యక్రమాలు నిర్వహించింది. పార్టీ నాయకులు, కార్యకర్తలను ఎన్నికలకు సిద్ధం చేసే పనిలో ఉండటంతో వేడి నెలకొంది.

వామపక్ష పార్టీలు..

వామపక్ష పార్టీలు కూడా పలు కార్యక్రమాలను చేపడుతున్నాయి. సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ ఆధ్వర్యంలో కోటకొండను మండలంగా మార్చాలని మూడు రోజుల పాటు దీక్షలు చేపట్టారు. ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని సీపీఎం నాయకులు బస్సుయాత్ర చేపట్టారు. పలు సమస్యలపై నిరసన కార్యక్రమాలు చేపడుతున్నారు. ఇలా జిల్లా వ్యాప్తంగా ప్రధాన రాజకీయ పార్టీల నాయకుల పర్యటనలు, కార్యక్రమాలతో జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల వేడి నెలకొంది.

ప్రారంభమైన పథకాల పర్వం

- జిల్లాలో లబ్ధిదారుల ఎంపికకు గ్రామ, వార్డు సభల నిర్వహణ
- నాలుగు కొత్త సంక్షేమ పథకాలకు ఎంపికలు
- జాబితాలో పేర్లు లేకపోతే కొత్తగా దరఖాస్తుల స్వీకరణ
- హాజరైన ఎమ్మెల్యేలు, కలెక్టర్



కొత్తపల్లి మండలం దుప్పట్లగట్టు గ్రామసభలో మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

నారాయణపేట, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులకు అందించేందుకు జిల్లా వ్యాప్తంగా మంగళవారం పంచాయతీల్లో గ్రామ సభలు, మునిసిపాలిటీల్లో వార్డు సభలకు జిల్లా అధికార యంత్రాంగం శ్రీకారం చుట్టింది. సభల్లో అర్హుల జాబితాను వెల్లడిస్తున్నారు. జాబితాలో పేర్లు లేకపోతే మళ్లీ కొత్త దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. నారాయణపేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి నారాయణపేట మునిసిపాలిటీలోని ఏడు, ఐదవ వార్డు సభలకు హాజరయ్యారు. కలెక్టర్ సిక్తా పట్నాయక్‌తో పాటు, మునిసిపల్ చైర్‌పర్సన్ గందె అనసూయ, మార్కెట్ చైర్మన్ శివారెడ్డి, మునిసిపల్ కమిషనర్ సునిత, వార్డు కౌన్సిలర్లు ఎండీ.సలీం తదితరులు హాజరయ్యారు. మక్తల్ మునిసిపాలిటీ పరిధిలోని వార్డు నెంబర్ ఒకటితో పాటు, మండలంలోని కర్ని, చిట్యాల మాగనూర్ మండలం మందిపల్లి, కృష్ణ మండలం చేగుంటలో నిర్వహించిన గ్రామసభల్లో ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి పాల్గొన్నారు. దామరగిద్ద మండలం దేశాయిపల్లిలో జరిగిన గ్రామసభలో తమ పేర్లు లేవని పలువురు పేర్కొనగా, కొత్తగా దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో సాయిలక్ష్మి సూచించారు. ముస్తాపేట్‌లో డీఎల్‌పీవో సుదర్శన్ రెడ్డి, ఎంపీవో ఉదయ్‌కుమార్ గ్రామసభకు హాజరు కాగా మాజీ సర్పంచ్ లాలప్ప పలువురి లబ్ధిదారుల పేర్లు లేవని ఆందోళన వ్యక్తం చేశారు. కొత్తపల్లి మండలం దుప్పట్లగట్టు గ్రామస్థులు సభలో కింద కూర్చోవడంతో కలెక్టర్ సిక్తా పట్నాయక్ సైతం కింద కూర్చున్నారు. ఆర్డీవో రాంచందర్ లబ్ధిదారుల జాబితాను చదివారు. గ్రామ సభలో జనాల మధ్యనే సాదాసీదాగా కలెక్టర్ కింద కూర్చుని అందరిలో కలిసిపోయి మాట్లాడారు. ఆర్డీవో రాంచందర్, అధికారులు కూడా కిందనే కూర్చున్నారు.

జిల్లాలో గ్రామసభ బృందాలు ఇలా..

జిల్లా వ్యాప్తంగా 280 గ్రామ పంచాయతీలకు గాను 53 అధికారుల బృందాలు మంగళవారం 80 గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించారు. 22న 75 గ్రామసభలు, 23న 68 గ్రామసభలు, 24న 57 గ్రామ సభలు జరుపనున్నారు. జిల్లాలోని కోస్గి, మక్తల్, నారాయణపేట మూడు మునిసిపాలిటీల్లో 56 వార్డులకు గాను 14 మంది అధికారుల బృందాలు వార్డు సభల్లో పాల్గొన్నాయి. మంగళవారం 14 వార్డుల్లో గ్రామసభలు జరిగాయి. 22 నుంచి 24 వరకు రోజు 14 వార్డు సభలు జరుపనున్నారు. జిల్లా వ్యాప్తంగా గ్రామ పంచాయతీలతో పాటు మునిసిపాలిటీలు కలిపి మొత్తం 67 అధికారుల బృందాలు 336 గ్రామ, వార్డు సభలు నిర్వహించేలా కలెక్టర్ నేతృత్వంలో అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది.



పేట మునిసిపాలిటీలోని ఏడవ వార్డులో నిర్వహించిన సభకు హాజరైన ప్రజలు

ముగ్గురు
సైబర్ నేరస్థుల అరెస్ట్
- రూ.4 కోట్లు కాజేసిన ముఠాలో సభ్యులుగా గుర్తింపు
- రూ. 30 లక్షల విలువైన కారు, ఎక్స్‌కవేటర్ స్వాధీనం 7
- వివరాలు వెల్లడించిన సైబర్ క్రైమ్ డీఎస్పీ రత్నం



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రత్నం

మెరుగైన ఫలితాలే లక్ష్యం
- ఇంటర్‌లో గతం కంటే మంచి ఉత్తీర్ణత కోసం కృషి
- 36 కేంద్రాల్లో ప్రయోగ, థియరీ పరీక్షలు
- అఫ్లియేషన్ రాని 12 ప్రైవేటు కళాశాలలకు రూ.లక్ష జరిమానా
- మహబూబ్‌నగర్ డీఐఈవో కౌసర్ జహాన్

ఇంటర్‌లో గత ఏడాదికన్నా మెరుగైన ఫలితాలే లక్ష్యంగా పని చేస్తున్నామని అంటున్నారు మహబూబ్‌నగర్ డీఐఈవో కౌసర్ జహాన్. ప్రీ ఫైనల్ పరీక్షలు ప్రారంభం అయ్యాయని, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు వచ్చే నెల మూడో తేదీ నుంచి ప్రయోగ పరీక్షలు ప్రారంభం అవుతాయని తెలిపారు. ఆమె మంగళవారం 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. ఆ వివరాలు..

– మహబూబ్‌నగర్ విద్యావిభాగం 6

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ



రెఫరల్ ఆస్పత్రిగా ఎందుకు మారుస్తున్నారు?

విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదు : ఎమ్మెల్యే పర్ణికారెడ్డి



నారాయణపేట జిల్లా ఆస్పత్రిలో రికార్డులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పర్ణికారెడ్డి

నారాయణపేట, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిని రెఫరల్ ఆస్పత్రిగా మార్చడం తగదని, వైద్య సిబ్బంది విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి హెచ్చరించారు. మంగళవారం ఆమె నారాయణపేట జిల్లా ఆస్పత్రిని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అత్యవసర చికిత్స కోసం వచ్చే నిరుపేదల పట్ల కొందరు సిబ్బంది నిర్లక్ష్యం వహించి మహబూబ్‌నగర్‌కు ఎందుకు రెఫర్ చేస్తున్నారని ప్రశ్నించారు. కొందరు ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లాలని చెబుతున్నారని, రాత్రి వేళల్లో విధులు సక్రమంగా నిర్వహించడం లేదని ఫిర్యాదులు వచ్చాయని చెప్పారు. ఆస్పత్రిలో అవసరం మేరకు మందులు ఉంచుకోవాలని, బయటికి రాయొద్దని చెప్పారు. ఇటీవల సిబ్బంది పనితీరు అస్తవ్యస్తంగా మారడంతో నిరుపేద రోగులు అవస్థలు పడుతున్నారని, పద్ధతి మార్చుకోవాలని హితవు పలికారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించే వారిపై చర్యలకు వెనుకాడబోమని సూపరింటెండెంట్ మల్లికార్జున్, అదనపు సూపరింటెండెంట్ ఆదిత్యలకు సూచించారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ జానకి

రహదారి భద్రతలో డ్రైవర్ల పాత్ర కీలకం : ఎస్పీ

మహబూబ్‌నగర్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): రహదారి భద్రతలో డ్రైవర్లదే ప్రముఖపాత్ర అని మహబూబ్‌నగర్ ఎస్పీ జానకి అన్నారు. రహదారి భద్రతా నియమాలు పాటిస్తూ, ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాల్సిన బాధ్యత మీదేనని చెప్పారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం పోలీసు కవాతు మైదానంలో స్కూల్, కళాశాలల బస్సు డ్రైవర్లకు ట్రాఫిక్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మానసిక నిపుణులతో సూచనలు ఇవ్వడంతో పాటు కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేసి పరీక్షలు చేయించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ డ్రైవర్లు తమ కంటిచూపు, మానసిక స్థితిపై క్రమం తప్పకుండా పరీక్షలు చేసుకోవాలని సూచించారు. డ్రైవింగ్ సమయంలో ఏకాగ్రత ఉండాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కోరారు. కార్యక్రమంలో వర్టికల్ డీఎస్పీ సుదర్శన్, మానసిక నిపుణులు భార్గవ్ స్వరాజ్, ఎంపీఐ రఘుకుమార్, ట్రాఫిక్ సీఐ భగవంత్‌రెడ్డి, ఎంటీవో నగేశ్, కృష్ణయ్య పాల్గొన్నారు.

జనరల్ ఆస్పత్రిలో
ఉరేసుకొని మహిళ ఆత్మహత్య

- మహబూబ్‌నగర్‌కు చికిత్స కోసం వచ్చి బాత్‌రూమ్‌లో బలవన్మరణం


నారమ్మ(ఫైల్)

మహబూబ్‌నగర్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్యం కారణంగా ఆసుపత్రిలో చేరిన ఓ మహిళ ఆత్మహత్య చేసుకోవడం కలకలం రేపింది. చికిత్స కోసం వస్తే శవంగా తీసుకెళ్లాల్సి రావడంతో బాధిత కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. మృతురాలి తండ్రి ఎంగలి చెన్నప్ప పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం నారాయణపేట జిల్లా దామరగిద్ద మండలం కందెన్‌పల్లికి చెందిన నారమ్మ(30)కు పదమూడేళ్ళ క్రితం దామరగిద్దకు చెందిన ఉసేనప్పతో వివాహం జరిగింది. అల్లుడిని ఇల్లరికం చేసుకోవడంతో కందెన్‌పల్లిలోనే ఉండేవారు. వీరికి ఇద్దరు కూతుళ్లు, ఓ కుమారుడు ఉన్నారు. ఆరేళ్ళక్రితం భార్యాభర్తల మధ్య వచ్చిన మనస్పర్థల కారణంగా పెద్దల సమక్షంలో మాట్లాడుకొని విడిపోయారు. కొంత కాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న నారమ్మను సోమవారం రాత్రి 10 గంటల సమయంలో ఆమె అల్లుడు నరేశ్ చికిత్స నిమిత్తం మహబూబ్‌నగర్ జనరల్ ఆసుపత్రిలో చేర్చాడు. మంగళవారం ఉదయం 6:30 గంటలకు బాత్‌రూమ్‌కు వెళ్తానని వార్డు నుంచి వెళ్ళిన ఆమె పక్క వార్డులోకి వెళ్లి అక్కడ బాత్‌రూమ్‌లో టవల్‌తో కిటికీ ఎగ్జాస్ట్ ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నది. అరగంట అయినా బాత్‌రూమ్‌కు వెళ్ళిన అత్త రాకపోవడంతో అల్లుడు నరేశ్ ఆమెకోసం వెతుక్కుంటూ వెళ్ళాడు. బాత్‌రూమ్ తలుపులు తీసి చూడగా ఉరేసుకొని మృతిచెంది ఉండటాన్ని గమనించి అక్కడి సిబ్బందికి తెలియజేశాడు. విషయం తెలుసుకున్న టుటౌన్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని కిందకు దించారు. ఆమె ఆత్మహత్య చేసుకోవడంపై పలు అనుమానాలు వ్యక్తంఅవుతున్నాయి. ఆమె కల్లుకు బానిసై మతిస్థిమితం లేక ఉరేసుకొని ఉంటుందని, ఆసుపత్రి సిబ్బంది దుర్భాషలాడటం వల్ల ఆత్మహత్య చేసుకున్నదని రకరకాల వదంతులు వినిపించాయి. వైద్యులు మాత్రం ఆల్కాహాల్ విత్‌డ్రాయల్ సిండ్రోమ్ లక్షణాలున్నాయని తెలిపారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుండేదని ఆ కారణంగానే ఆత్మహత్య చేసుకున్నదని, దీనిపై ఎలాంటి అనుమానాలు లేవని మృతురాలి తండ్రి ఎంగలి చెన్నప్ప ఫిర్యాదులో పేర్కొన్నాడు. అనుమానాస్పద మృతిగా టుటౌన్ పోలీసులు కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

జిల్లా పరిషత్‌కు చేరిన ఎన్నికల సామగ్రి


జిల్లా పరిషత్‌కు చేరుకున్న ఎన్నికల సామగ్రితో ఉద్యోగులు

మహబూబ్‌నగర్ టౌన్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో సర్పంచుల పరిపాలన కాల పరిమితి ముగిసి దాదాపు ఆరు నెలలు కావడంతో త్వరలోనే ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తోంది. మొదట గ్రామ పంచాయతీల ఎన్నికల తర్వాత జిల్లా పరిషత్, మండల పరిషత్ ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉండటంతో మంగళవారం ఎన్నికల సామగ్రి జిల్లా పరిషత్‌కు చేరింది. ఇప్పటికే గ్రామ పంచాయతీ ఎన్నికల గుర్తుల ముద్రణ ప్రారంభమైంది. ఈ క్రమంలో ఉద్యోగులకు ఎన్నికల శిక్షణ ఇవ్వనున్నారు. ప్రస్తుతం మహబూబ్‌నగర్ జిల్లాలో 898 మండల ప్రాదేశిక సభ్యులతో పాటు 16 జిల్లా ప్రాదేశిక సభ్యులను ఎన్నికల ద్వారా ఎన్నుకోనున్నారు. గతంలో 14 మండలాలకు మాత్రమే ఎన్నికలు జరగగా, కౌకుంట్ల, మమ్మదాబాద్ కొత్త మండలాలు ఏర్పడటంతో ఆ సంఖ్య 16కు చేరింది.

మెరుగైన ఫలితాలే లక్ష్యం

- ఇంటర్‌లో గతం కంటే మంచి ఉత్తీర్ణత కోసం కృషి
- 36 కేంద్రాల్లో ప్రయోగ, థియరీ పరీక్షలు
- అఫ్లియేషన్ రాని 12 ప్రైవేటు కళాశాలలకు రూ.లక్ష జరిమానా
- మహబూబ్‌నగర్ డీఐఈవో కౌసర్ జహాన్

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ఇంటర్‌లో మంచి ఫలితాల కోసం కృషి చేస్తున్నామని మహబూబ్‌నగర్ డీఐఈవో కౌసర్ జహాన్ అన్నారు. జిల్లాలోని 12 అఫ్లియేషన్ రాని కళాశాలలకు బోర్డు రూ.లక్ష చొప్పున జరిమానా విధించిందని అంటున్న ఆమె మంగళవారం 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. ఆ వివరాలు..

సిలబస్ పూర్తయ్యిందా?

సిలబస్ గత డిసెంబరులోనే పూర్తయ్యింది. రివిజన్ తరగతులు చివరి దశలో ఉన్నాయి. ఇప్పటికే ప్రీ ఫైనల్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. అవి ఈనెల చివరలో పూర్తవుతాయి.

ప్రయోగ పరీక్షలకు ఏర్పాట్లు చేశారా?

జనరల్ ద్వితీయ ఏడాది విద్యార్థులు, ఒకేషనల్ విద్యార్థులకు సంబంధించి ఫిబ్రవరి 3 నుంచి 22 వరకు ప్రయోగ పరీక్షలు ఉంటాయి. జనరల్ విభాగం ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు 36 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశాం. ప్రభుత్వ ప్రైవేటు కళాశాలల్లో కేంద్రాలు ఉన్నాయి. ఒకేషనల్‌కు సంబంధించి 13 కేంద్రాలు రెడీ చేశాం.

జిల్లాలో చాలా కళాశాలలకు అఫ్లియేషన్ రాలేదంటున్నారు?

జిల్లాలోని 12 ప్రైవేట్ కళాశాలలకు ఇంకా ఇంటర్ బోర్డు నుంచి అఫ్లియేషన్ రాలేదు. ఆయా కళాశాలలు ఒక్కోటి రూ.లక్ష జరిమానా చెల్లించాలని బోర్డు చెప్పింది. కానీ వారు ఇప్పటి వరకు చెల్లించ లేదు. అందులో చదివే 1086 మంది విద్యార్థుల ఫీజు రూ.2,500 చొప్పున చెల్లించాల్సి ఉంది. కానీ అఫ్లియేషన్ లేనందున ఫీజు చెల్లించే అవకాశం లేదు. దీనిపై బోర్డే నిర్ణయం తీసుకోవాలి. ఆయా కళాశాలల్లోన్ని ద్వితీయ సంవత్సరం విద్యార్థులు నష్టపోకుండా ప్రభుత్వ కళాశాలలకు బదిలీ చేశాం.

జిల్లాలో మొత్తం ఎన్ని కళాశాలలు ఉన్నాయి? ఎంత మంది పరీక్షలు రాయనున్నారు?

జిల్లాలో 14 ప్రభుత్వ, 74 ప్రైవేట్ కళాశాలలు ఉన్నాయి. మొదటి సంవత్సరం విద్యార్థులు 9,885 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 8,186 మంది పరీక్షలు రాయనున్నారు. మొత్తం 36 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశాం. ఈ కేంద్రాలకు సంబంధించి కొన్ని మార్పులు జరిగే అవకాశం ఉంది.

గతంలో ప్రయోగ పరీక్షలకు సంబంధించి ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు అవకతవకలకు పాల్పడ్డట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ సారి ఎలాంటి ఏర్పాట్లు చేస్తున్నారు?

ఈ ఏడాది ఎలాంటి అవకతవకలు, కాపీయింగ్ జరుగకుండా అన్ని కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నాం. పరీక్ష కేంద్రానికి పది మీటర్ల మేర ఎక్కడ ఏం శబ్దం వచ్చినా ఆ కెమెరాల్లో రికార్డు అవుతుంది.

చాలా ప్రయోగ పరీక్ష కేంద్రాల్లో సరైన పరికరాలు లేవన్న ఆరోపణలు ఉన్నాయి. ఏమంటారు?

గతంలో అలా ఉండేది. ఈ ఏడాది ప్రభుత్వ కళాశాలలన్నింటికీ ప్రత్యేకంగా ప్రయోగ పరికరాల కోసం ప్రతీ కళాశాలకు రూ.25 వేలు ఇచ్చారు. అన్ని పరికరాలు కొనుగోలు చేసి సిద్ధంగా ఉంచాం. ప్రైవేటులో పరికరాలు ఉన్న కళాశాలల్లోనే పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశాం.

90 శాతమున్న బీసీలకు న్యాయమేది?

- తెలంగాణ బీసీ సంఘం వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ


సమావేశంలో మాట్లాడుతున్న ఎర్ర సత్యనారాయణ

పాలమూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో 90 శాతమున్న బీసీలకు సామాజిక న్యాయం ఎప్పుడు జరుగుతుందని తెలంగాణ బీసీ సంఘం వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలో బీసీ కులాల ఐక్యవేదిక ముఖ్య నాయకుల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. సమాజంలో 90శాతం ఉన్న జనాభా ఒకవైపు, 10 శాతం ఉన్న జనాభా ఒక వైపు ఏర్పాటయ్యారని తెలిపారు. తమిళనాడులో బీసీలకు 69శాతం అమలవుతోంది, తెలంగాణలో కేవలం 17శాతం అమలు చేయటమేమిటన్నారు. కేవలం ఏడు శాతమున్న అగ్రకులాలకు ఈడబ్ల్యుఎస్ కింద 10 శాతం రిజర్వేషన్లు అమలు చేయటాన్ని తీవ్రంగా పరిగణించాలన్నారు. బీసీలు ఇప్పటికీ ఏకం కాకపోతే రాజకీయ, శాసన, ఆర్థిక, న్యాయ వ్యవస్థల్లో భాగస్వామ్యం కాకపోతే అక్కడ మనం బానిసలుగా మిగిలిపోతామని హెచ్చరించారు. రాబోవు ఎన్నికల్లో ఎస్సీ, ఎస్టీ రిజర్వు స్థానాలు పోను మిగిలిన అన్నింటా బీసీలు పోటీ చేయాలన్నారు. బీసీ కులాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు పాండు యాదవ్, మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంధ్యారాణి, యువజన అధ్యక్షులు తుమ్మల చెన్నయ్య, నరసింహులు, ఎల్.భీమేష్, ఎన్.బి కృష్ణ, నాగిరెడ్డియాదవ్, గణేష్, రాకేష్, హర్షవర్ధన్, ప్రేమ్‌కుమార్, చిన్న ప్రసంగించారు.

హక్కులపై అవగాహన అవసరం

- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి డి.ఇందిర


హన్వాడ గురుకుల పాఠశాల విద్యార్థులతో మాట్లాడుతున్న ఇందిర

హన్వాడ, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : రాజ్యాంగంలో కల్పించిన ప్రాథమిక హక్కులపై ప్రతీ ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ న్యాయాధికారి డి.ఇందిర అన్నారు. జాతీయ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాల మేరకు చైల్డ్ ఫ్రెండ్లీ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం హన్వాడ మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ గురుకుల పాఠశాలలో న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలవివాహాల నివారణ, బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన, బాలల చట్టాలు వంటి అంశాలపై సూచనలు, సలహాలు ఇచ్చారు. స్నేహ పూర్వకమైన బాలల న్యాయ సేవల పథకం 2024 ప్రకారం బాలల హక్కులు కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌లపై అవగాహన కల్పించాలన్నారు. బాలలు ఏదైన సమస్య వస్తే 1098కు ఫోన్ చేస్తే అధికారులు వెంటనే స్పందిస్తారని తెలిపారు. అంతకుముందు పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా ఆమె భూ వివాదంపై ఫిర్యాదు కోసం వచ్చిన టంకర గ్రామ రైతులతో సమీక్షించారు. వివాదానికి సంబంధించి ఇరువురి అభిప్రాయాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. సమస్య ఏదైనా చట్ట ప్రకారం పరిష్కరించుకోవాలన్నారు. పోలీస్ స్టేషన్‌లో చైల్డ్ ఫ్రెండ్లీ కమిటీ బ్యానర్‌ను ఏర్పాటు చేసి, కేసుల వివరాలను ఎస్‌హెచ్‌వోను అడిగి తెలుసుకున్నారు. ప్రిన్సిపాల్ స్పందన, సీనియర్ న్యాయవాది రవి కుమార్ యాదవ్, చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి రాములు, పారా లీగల్ వలంటీర్లు పల్లమోని యాదయ్య, నాగభూషణం, శివన్న, సురేష్, తిరుమలేష్ పాల్గొన్నారు.

29న డివిజన్ స్థాయి పెన్షన్ పోస్టల్ అదాలత్

మహబూబ్‌నగర్ టౌన్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 29న ఉదయం 11 గంటలకు జిల్లా పోస్టల్ కార్యాలయంలో డివిజన్ స్థాయి పెన్షన్ పోస్టల్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు జిల్లా తపాలా పర్యవేక్షకురాలు విజయజ్యోతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 27 వరకు తమ ఫిర్యాదులను పోస్టల్ పెన్షన్ అదాలత్ మహబూబ్‌నగర్ డివిజన్‌కు పంపించాలని కోరారు. మహబూబ్‌నగర్ డివిజన్ పరిధిలోని నారాయణపేట, మహబూబ్‌నగర్, గద్వాల, మహబూబ్‌నగర్ డివిజన్ పరిధిలోని వనపర్తిలోని కొన్ని గ్రామాల వారు, వికారాబాద్ పరిధిలోని వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ముగిసిన ధ్రువపత్రాల పరిశీలన

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : పరస్పర బదిలీల కోసం దరఖాస్తు చేసుకున్న ఉపాధ్యాయుల ధ్రువపత్రాల పరిశీలన మంగళవారంతో ముగిసింది. జిల్లాలో మొత్తం 52 దరఖాస్తులు రాగా అందులో నాలుగు రిజక్టు అయినట్లు అధికారులు తెలిపారు. మిగితా 48 దరఖాస్తులను పూర్తి చేసి రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ కార్యాలయానికి పంపించినట్లు తెలిపారు.

స్పౌజ్ బదిలీలు ప్రారంభం

మహబూబ్‌నగర్ జిల్లాకు 132 మంది ఉపాధ్యాయులను కేటాయించారు. వారంతా ఆయా జిల్లాలో రిలీవ్ అయి జిల్లాకు వచ్చి రిపోర్టు చేస్తున్నారు. వీరికి బుధవారం నుంచి పోస్టింగ్ ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం.

'ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలి'

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ, బీసీ సంక్షేమ, జనరల్ గురుకులాల్లో ఐదో తరగతి ఇంగ్లిష్ మీడియం, 6, 7, 8, 9వ తరగతి మిగులు సీట్లుకు గాను ఫిబ్రవరి 1 లోపు దరఖాస్తు చేసుకోవాలని గిరిజన సంక్షేమ శాఖ ఇన్‌చార్జి అధికారి సరస్వతి మంగళవారం ఒక ప్రకటలో తెలిపారు. 23న ఉదయం పరీక్ష ఉంటుందని తెలిపారు.

ఆశా వర్కర్లకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

- యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు జయలక్ష్మి


కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఆశా వర్కర్లు

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ఆశా వర్కర్లకు ఎన్నికల సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు జయలక్ష్మి డిమాండ్ చేశారు. తమ డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ.. ఆశా వర్కర్లు మంగళవారం జిల్లా కేంద్రంలోని జమ్మిచెట్టు నల్లచెరువు నుంచి కలెక్టరేట్ వరకు పాదయాత్ర చేశారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎన్నికల సందర్భంగా ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చాలన్నారు. ఆశలకు నెలకు రూ.18 వేలు ఫిక్స్‌డ్ వేతనం చెల్లించాలని, పీఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. రూ.50 లక్షల ఇన్సూరెన్స్, రూ.50 వేల మట్టి ఖర్చులు, టార్గెట్లు రద్దు చేస్తూ.. గతంలో ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. వేతనంతో కూడిన 20 రోజుల క్యాజువల్ సెలవులు, ఆరునెలల మెడికల్ సెలవులు కల్పించాలన్నారు. 2021 జూలై నుంచి డిసెంబరు వరకు పీఆర్ ఏరియర్స్, లెప్రసీ సర్వే, పల్స్ పోలియో డబ్బులు వెంటనే చెల్లించాలని కోరారు. ప్రభుత్వం వెంటనే స్పందించి తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ వనపర్తి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాజు, అంజనేయులు, బొబ్బిలి నిక్సన్, రమేష్, రాములు, బుచ్చమ్మ, సునీత, భాగ్య, దేవమ్మ, అనసూయ, సత్యమ్మ, శ్యామల, అరుణ, మంజుల పాల్గొన్నారు.

విద్యుత్ ఆర్టిజన్లను కన్వర్షన్ చేయాలి

- ఏఐటీయూసీ రాష్ట్ర సహాయ కార్యదర్శి నర్సింహ


ఈగలపెంటలో దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న ఏఐటీయూసీ రాష్ట్ర సహాయ కార్యదర్శి నర్సింహ

దోమలపెంట, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వ్యాప్తంగా జెన్‌కో, ట్రాన్స్‌కో, డిస్కంలలో పని చేస్తున్న విద్యుత్ ఆర్టిజన్లను కన్వర్షన్ చేసే వరకు తమ పోరాటం కొనసాగిస్తామని ఏఐటీయూసీ రాష్ట్ర సహాయ కార్యదర్శి నర్సింహ అన్నారు. మంగళవారం ఈగలపెంటలో జేఏసీ ఆధ్వర్యంలో రెండోవ రోజు రిలే నిరాహార దీక్షలో పాల్గొన్న ఆర్టిజన్లకు సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా వివిధ విభాగాలలో విద్యుత్ సంస్థలో పని చేస్తున్న 20 వేల మంది ఆర్టిజన్లను విద్యా అర్హతలను బట్టి కన్వర్షన్ చేయాలని, స్టాండింగ్ ఆర్డర్ ప్రకారం ఆర్టిజన్‌గా ఐదు సంవత్సరాలు సర్వీస్ పూర్తి చేసిన వారికి ఇంక్రిమెంట్‌లు, ప్రమోషన్‌లు ఇవ్వాలని ప్రభుత్వాని డిమాండ్ చేశారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి సమస్య పరిష్కరించాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున విద్యుత్ సౌధను ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మారేడు శివశంకర్, కార్యదర్శి రామయ్య, సీఐటీయూ కిషన్, సుబ్బారెడ్డి, మల్లేష్‌రెడ్డి, లక్ష్మయ్య, రామయ్య, శంకర్, సీతాలక్ష్మి, తిమ్మన్న, శేఖర్‌యాదవ్, ప్రసాద్ పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి మార్గం సుగమం

అయిజటౌన్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : గ్రామస్థాయిలోనే భూ సమస్యలు పరిష్కరించుకునేందుకు ఎన్నో ఏళ్లుగా ప్రభుత్వాలు వీఆర్‌వో వ్యవస్థను కొనసాగిస్తూనే వచ్చాయి. బీఆర్ఎస్ పాలనలో అర్థాంతరంగా వీఆర్‌వో వ్యవస్థను రద్దు చేశారు. అప్పటి నుంచి ఏ చిన్న భూసమస్య ఉన్నా మండల, జిల్లా స్థాయిలో ఉండే అధికారుల వద్దకు వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడింది. సమస్య పరిష్కారానికి ఎవరిని కలువాలో తెలియక రైతులు ఇబ్బంది పడుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామాల్లోనే భూ సమస్యలు పరిష్కరించాలని పటిష్టమైన వ్యవస్థను ఏర్పాటు చేస్తామని ప్రకటించింది. ప్రకటనకు అనుగుణంగానే నేడు ప్రభుత్వం వీఆర్‌వోల నియామకానికి కసరత్తు మొదలుపెట్టింది.

ఉమ్మడి జిల్లాలో..

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో మొత్తం 1,690 గ్రామపంచాయతీలకు గానూ 1,265 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. ఇప్పటికే ఉన్న ధరణి స్థానంలో కొత్త చట్టం అమలు చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఈ విధానం ప్రకారం ఒక్కో రెవెన్యూ గ్రామానికి ఒక్కో కార్యదర్శిని నియమించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. జూనియర్ రెవెన్యూ ఆఫీసర్ (జేఆర్‌వో) పేరుతో జరిగే నియామకాల్లో గతంలో వీఆర్‌వోలుగా పనిచేసిన వారికి మొదటి ప్రాధాన్యం ఉంటుందని ప్రభుత్వం ప్రకటించటంతో ఇప్పటికే అనేక మంది గ్రామాల్లో రెవెన్యూ విధులు నిర్వహించేందుకు దరఖాస్తు చేసుకున్నారు. కొత్త రెవెన్యూ చట్టం ప్రకారం ప్రతీ రెవెన్యూ గ్రామానికి ఒక జేఆర్‌వోను నియమంచటం వల్ల రైతుల భూసమస్యలకు గ్రామాల్లోనే పరిష్కారం లభించనున్నది.

రైతులకు మేలు జరుగుతుంది



వీఆర్‌వోలను నియమిస్తే రైతులకు మేలు జరిగే అవకాశం ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న రైతులు నిరక్షరాస్యులు. వారు భూమి సమస్య పరిష్కారం కోసం జిల్లా అధికారుల వద్దకు వెళ్లలేరు. సొంత గ్రామంలోనే అధికారులు ఉంటే వారి ద్వారానే ఆ సమస్యను పరిష్కరించుకుంటారు.

- మాణిక్యం, మద్దూరు, మానోపాడు

కొత్త చట్టం అమలైన వెంటనే



ప్రభుత్వం ధరణి స్థానంలో కొత్తచట్టాన్ని అమలు చేస్తోంది. ఆ కొత్తచట్టం అమలులోకి వచ్చిన వెంటనే ప్రతీ రెవెన్యూ గ్రామానికి ఒక జేఆర్‌వోను నియమిస్తాం. ఇప్పటికే అందుకు దరఖాస్తులు స్వీకరించాము. గద్వాల జిల్లాలో 209 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి.

- లక్ష్మీనారాయణ, అదనపు కలెక్టర్, గద్వాల

విజయవంతంగా గ్రామ సభలు

- కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పథకాలకు లబ్ధిదారుల ఎంపిక కోసం నిర్వహించిన గ్రామసభలు విజయవంతంగా కొనసాగుతున్నాయని కలెక్టర్ ఆదర్శ్ సురభి తెలిపారు. జిల్లాలో మంగళవారం 137 గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించినట్లు ఆయన పేర్కొన్నారు. తొలిరోజు గ్రామసభల నిర్వహణ సమస్యలపై రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ఉప ముఖ్య మంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఉత్తమ్‌కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, తుమ్మల నాగేశ్వర్ రావు కలెక్టర్లతో వీసీ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ జిల్లాలో నిర్వహించిన గ్రామ సభ వివరాలు వెల్లడించారు. వనపర్తి జిల్లాలో తొలి రోజున 137 గ్రామాల్లో గ్రామ సభలు విజయవంతంగా నిర్వహించడం జరిగిందన్నారు. కాగా ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి 23944 దరఖాస్తులు గ్రామసభల్లో ఆమోదం పొందాయన్నారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసాకు సంబంధించి 3497 పేర్లు గ్రామసభల్లో ఆమోదం పొందినట్లు పేర్కొన్నారు. కొత్త రేషన్ కార్డులకు సంబంధించి 11697 దరఖాస్తులు గ్రామసభల్లో ఆమోదం పొందినట్లు వివరించారు. రైతు భరోసాకు సంబంధించి 38861 దరఖాస్తులు గ్రామ సభల్లో ఆమోదం పొందినట్లు ఆయన పేర్కొన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు సంచిత్ గంగ్వార్, వెంకటేశ్వర్లు, జడ్పీ సీఈవో ఉన్నారు.

'రైతుబంధు'ను భ్రష్టు పట్టించారు

- సర్వేలో వెలుగులోకి వస్తున్న వాస్తవాలు



నాగర్‌కర్నూల్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా పథకం అమలు కోసం నిర్వహిస్తున్న సమగ్ర సర్వేలో నాగర్‌కర్నూల్ జిల్లాలో అనేక వాస్తవాలు వెలుగులోకి వస్తున్నాయి. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పెట్టుబడి సాయం కోసం అమలు చేసిన 'రైతుబంధు' పథకం నిధులు ప్రజా ప్రతినిధుల ఒత్తిడి, అధికారుల ప్రమేయంతో అనర్హులు కూడా లబ్ధిపొందారు. విచిత్రమైన అంశమేమిటంటే అమెరికాలో నివసిస్తూ కల్వకుర్తి నియోజకవర్గంలో వందల ఎకరాలు భూమిని కొనుగోలు చేసిన వారికి ఖాతాలలో కూడా 'రైతుబంధు' నిధులు జమ చేశారు. ఒక పక్క 'రైతు బంధు' కింద నిధులు తీసుకుంటూనే ఎన్ఆర్ఐలు తమ పొలాలను కౌలుకు ఇచ్చి ఎకరాకు రూ.5 నుంచి రూ.10వేల వరకు వసూలు చేసుకున్నారు.

తేలుతున్న లెక్కలు..

సాగుకు యోగ్యమైన భూములకే రైతు భరోసా నిధులు ఇవ్వాలని సంకల్పించిన కాంగ్రెస్ ప్రభుత్వం క్షేత్రస్థాయిలో సర్వే చేయించడంతో వాస్తవాలు వెలుగు చూస్తున్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లాలో బీఆర్ఎస్ హయాంలో 'రైతుబంధు' కింద కోట్ల రూపాయల నిధులు దుర్వినియోగమైనట్లు ప్రాథమిక విచారణలో తేలింది. చారకొండ మండలంలో వ్యవసాయ భూమి సాగు విస్తీర్ణం మొత్తం 21,342 ఎకరాలు కాగా అచ్చంపేట మండలంలో కూడా అదే పరిస్థితి నెలకొంది. మండలంలో రైతు భరోసా కింద అనర్హులుగా 350 ఎకరాలను గుర్తించారు. తెలకపల్లి మండలంలో మొత్తం సాగు విస్తీర్ణం 48,592 ఎకరాలు కాగా సాగుకు యోగ్యం కాని 260 ఎకరాలను రెవెన్యూ సంయుక్త బృందం గుర్తించింది. వెల్దండ, బిజినేపల్లి, అమ్రాబాద్, ఉప్పునుంతల, బల్మూరు, కల్వకుర్తి, ఊర్కొండ, పెంట్లవెల్లి, నాగర్‌కర్నూల్, కొల్లాపూర్‌లలో ఇదే పరిస్థితి పునరావృతమైంది. నాగర్‌కర్నూల్‌లో 450ఎకరాలు, పెంట్లవెల్లిలో 92 ఎకరాలు, ఊర్కొండలో 355 ఎకరాలు, కల్వకుర్తిలో 615ఎకరాలు, బల్మూరులో 240ఎకరాలు, ఉప్పునుంతల 132ఎకరాలు, అమ్రాబాద్ 140ఎకరాలు, బిజినేపల్లిలో 902ఎకరాలు, వెల్దండలో 1,150ఎకరాలు, తెలకపల్లిలో 260ఎకరాలు, అచ్చంపేటలో 350ఎకరాలు, చారకొండలో 239ఎకరాల 21గుంటలు సాగుయోగ్యం కాని భూమిగా అధికారులు గుర్తించారు.

నేతల భూములే ఎక్కువ..

నాగర్‌కర్నూల్ జిల్లాలో సోమశిల సిద్దేశ్వరం వంతెన నిర్మాణం 167కే జాతీయ రహదారితోపాటు హైదరాబాద్, శ్రీశైలం జాతీయ రహదారి వెంట రాజకీయ నేతలే విపరీతంగా భూములు కొనుగోలు చేశారు. జిల్లాకు చెందిన కొందరు నేతలకు కనీసం 50 ఎకరాలకు పైబడే భూమి ఉంది. వారందరూ కూడా 'రైతుబంధు' కింద వేల రూపాయలు తీసుకోవడం చర్చనీయాంశంగా మా రింది. జిల్లాకు చెందిన కొందరు నేతలు 'రైతుబంధు' పథకం కింద సమకూరిన నిధులను ప్రభుత్వానికి వాపసు చేయగా చాలా మంది విమర్శలను ఎదుర్కొంటుండడం గమనార్హం.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

- ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్ రెడ్డి


బిజినేపల్లి సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయంలో విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్ రెడ్డి

బిజినేపల్లి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలోని ప్రజాపాలనలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తామని ఎమ్మెల్యే డాక్టర్ కూచకుళ్ల రాజేష్‌రెడ్డి భరోసా ఇచ్చారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం ఆయా గ్రామాలకు చెందిన 39 మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయంలో ఇంటర్ చదువుతున్న 160 మంది విద్యార్థులకు స్టడీ చైర్స్ అందజేసి మాట్లాడారు. గత నెలలో నూతన డైట్‌ను ప్రారంభించేందుకు పాఠశాలకు వెళ్లిన ఎమ్మెల్యేను కొందరు విద్యార్థులు బెంచీలు, గ్రీన్ బోర్డ్స్ స్టడీ చైర్స్ కావాలని కోరారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే అసెంబ్లీ సమావేశంలో ప్రస్తావించి రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేసేలా సీఎం ఆదేశాలు జారీ చేసి మొదట బిజినేపల్లి పాఠశాలకు స్టడీచైర్స్ 16 గ్రీన్‌బోర్డులను పంపిణీ చేయించినట్లు తెలిపారు. స్టడీచైర్స్, గ్రీన్‌బోర్డులు అందజేసిన ఎమ్మెల్యేకు ప్రిన్సిపాల్ సుమతి, విద్యార్థులు, స్థానిక నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ చైర్మన్ మస్కూరి శంకర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మిద్దె రాములు, పీ ఏసీఎస్ చైర్మన్ వెంకటస్వామి, మాజీ సర్పంచులు తిరుపతయ్య, అవంతి, రాంచందర్, గోవింద నాయక్ తదితరులు ఉన్నారు.

మహిళా శక్తి క్యాంటీన్ శిక్షణ పూర్తి చేసుకున్న ఆశాబేగం

గద్వాల, జనవరి 21(ఆంధ్రజ్యోతి): మహిళలకు ఉపాధి కల్పనే లక్ష్యంగా ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ ఏర్పాటు చేసేందుకు ఆసక్తి గల మహిళలకు శిక్షణ ఇచ్చారు. అందులో భాగంగా జిల్లా నుంచి మహిళా సమాఖ్య జిల్లా మాజీ అధ్యక్షురాలు ఆశాబేగం హైదరాబాద్‌లోని నీతం హోటల్‌లో పదిరోజుల పాటు శిక్షణ తీసుకున్నారు. మంగళవారం కలెక్టర్ బీఎం సంతోష్, ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డిలను కలిశారు. కలెక్టరేట్‌లో ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ ఏర్పాటుకు అవకాశం కల్పిస్తున్నట్లు కలెక్టర్ ఆమెకు తెలిపారు. ఇందుకోసం దాదాపు రూ.10లక్షలకు పైగా సబ్సిడీ రుణం అందిస్తున్నట్లు డీఆర్‌డీఏ అధికారులు తెలిపారు.

డాక్టర్ ప్రణయ్ కార్డియాక్ కేర్ సెంటర్‌లో

మొట్టమొదటి బైపాస్ సర్జరీ

- త్వరలో అన్ని ప్రభుత్వ పథకాల అమలుకు ఏర్పాట్లు
- కార్డియాలజిస్టు డాక్టర్ ప్రణయ్



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ ప్రణయ్

మహబూబ్‌నగర్ (వైద్యవిభాగం) జనవరి 21 : ఉమ్మడి పాలమూరు జిల్లా చరిత్రలోనే మొట్టమొదటి బైపాస్ సర్జరీని తమ ఆసుపత్రిలో చేసినట్లు కార్డియాలజిస్టు డాక్టర్ ప్రణయ్ తెలిపారు. మహబూబ్‌నగర్ పట్టణంలోని డాక్టర్ ప్రణయ్ కార్డియాక్ కేర్ సెంటర్ (యూనిట్ ఆఫ్ డాక్టర్ శామ్యూల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి)లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో పాలమూరులో సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు ఉండేవి కావని, అందుకు సంబంధించిన చికిత్స కోసం హైదరాబాద్‌కు వెళ్లాల్సి వచ్చేదని తెలిపారు. ఈ వైద్య సేవలను మన మహబూబ్‌నగర్‌లోనే ఎందుకు తీసుకురావద్దనే కసితో శామ్యూల్స్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆసుపత్రిలో అన్ని రకాల వైద్య సేవలను అందిస్తున్నామన్నారు. మహబూబ్‌నగర్ మండలం, చిన్నదర్పల్లి గ్రామానికి చెందిన సత్యనారాయణ గుండెనొప్పితో తమ ఆసుపత్రికి వచ్చిన వెంటనే అన్ని పరీక్షలు చేసి బైపాస్ సర్జరీ అవసరమని గుర్తించామన్నారు. వెంటనే హైదరాబాద్‌కు చెందిన కొందరు ప్రత్యేక నిపుణులతో పాటు తాము కూడా ఒక బృందంగా ఏర్పడి విజయవంతంగా ఆయనకు బైపాస్ సర్జరీ చేశామన్నారు. గత ఏడాది అక్టోబర్ ఐదున సర్జరీ చేశామని, ఇప్పటి వరకు తమ అబ్జర్వేషన్‌లో ఉంచామని చెప్పారు. ఆయన పూర్తిగా కోలుకున్న తర్వాత మీడియా సమావేశం ద్వారా తెలియజేస్తున్నట్లు చెప్పారు. దీంతో పాటు సునీత అనే మహిళకు గుండె కవాటాల సర్జరీ చేశామని తెలిపారు. ఆమె కూడా కోలుకుంటోందని వెల్లడించారు. ఈ సర్జరీ కోసం రూ. 1.50 కోట్లతో అత్యాధునిక వైద్య పరికరాలను తమ ఆసుపత్రిలో ఏర్పాటు చేయించినట్లు తెలిపారు. ఇకపై అన్ని రకాల గుండె సర్జరీలు చేస్తామని, ఇప్పటి వరకు వెయ్యి మందికి యాంజియోగ్రామ్, రెండు వందల మందికి స్టెంట్లు వేశామని తెలిపారు. త్వరలో ప్రభుత్వ పథకాలు, హెల్త్ ఇన్సూరెన్సు పథకాలకు సంబంధించిన సర్జరీలు కూడా చేస్తామని, అందుకు అవసరమైన అనుమతుల ప్రక్రియ కొనసాగుతోందని చెప్పారు. తమ ఆసుపత్రిలోనే గ్యాస్ట్రో, గైనిక్, యూరాలజీ, న్యూరాలజీ, డెర్మటాలజీ తదితర వైద్య సేవలను కూడా అందిస్తున్నామన్నారు. సమావేశంలో గ్యాస్ట్రో ఎంట్రాల జిస్టు వివేక్‌సాగర్, డెర్మటాలజిస్టు డాక్టర్ ప్రతిమ, గైనకాలజిస్టులు డాక్టర్ సుహాసిని, డాక్టర్ నితీషా తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

చికిత్స పొందుతూ బాలుడి మృతి



అయిజ, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఓ బాలుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నాగర్‌దొడ్డి గ్రామానికి చెందిన శ్రీను, బింగిదొడ్డి గ్రామానికి చెందిన వీరాంజనేయులు (16) సోమవారం రాత్రి అయిజకు బయలుదేరారు. అయిజ నుంచి బిజ్వారం గ్రామానికి చెందిన వీరేశ్ అనే వ్యక్తి ద్విచక్ర వాహనంపై గద్వాల వైపు వస్తున్నాడు. అయిజ పట్టణంలోని కట్టకింద వేంకటేశ్వర ఆలయం సమీపంలో రెండు వాహనాలు ఎదురెదురుగా వస్తూ ఢీకొన్నాయి. ప్రమాదంలో వీరాంజనేయులు తీవ్రంగా గాయపడటంతో కర్నూల్ ఆస్పత్రికి తీసుకెళ్లగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో నలుగురికి జైలు శిక్ష

ఉప్పునుంతల/నారాయణపేట, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన నలుగురికి జైలు శిక్ష విధిస్తూ న్యాయాధికారి తీర్పునిచ్చారు. నాగర్‌కర్నూల్ జిల్లా, ఉప్పునుంతల ఎస్ఐ వెంకట్‌రెడ్డి, నారాయణపేట ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఉప్పునుంతల పోలీసులు డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించగా, వంగూర్ మండలం నిజామాబాద్ గ్రామానికి చెందిన మౌని తిర్పతయ్య, కల్వకుర్తి మండలం యన్నంపల్లికి చెందిన బండ్ల అంజనేయులు, వంగూర్ మండలం తుమ్మలపల్లి గ్రామానికి చెందిన రమాణారెడ్డి మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడ్డారు. వారిని మంగళవారం అచ్చంపేట కోర్టులో హాజరు పరచగా రెండు రోజుల జైలు శిక్ష విధిస్తూ న్యాయాధికారి తీర్పు వెల్లడించారు. నారాయణపేటలో ఈ నెల 19న నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో కర్ణాటక రాష్ట్రానికి చెందిన వెంకటేశ్ అనే వ్యక్తి పట్టుబడ్డాడు. ఆయనను కోర్టు డ్యూటీ అఫీసర్ అరవింద్ కోర్టులో హాజరు పరచగా, ఒక రోజు జైలుశిక్ష, వెయ్యి రూపాయల జరిమానా విధిస్తూ న్యాయాధికారి సయ్యద్ జకీయ సుల్తానా తీర్పు ఇచ్చారు.

మద్యం తాగొద్దన్నందుకు ఆత్మహత్యాయత్నం

- చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మానవపాడు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్ఐ చంద్రకాంత్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జోగుళాంబ గద్వాల జిల్లా మానవపాడు మండలంలోని చిన్నపోతులపాడు గ్రామానికి చెందిన చాకలి మద్దిలేటి (45) మద్యానికి బానిసయ్యాడు. దీంతో మద్యం తాగొద్దని కుటుంబ సభ్యులు మందలించడంతో గత నెల 27న పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి కర్నూల్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు. భార్య ఈశ్వరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వృద్ధుడి మృతి

బిజినేపల్లి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ బస్సు ఢీకొని ఓ వృద్ధుడు మృతి చెందాడు. ఎస్ఐ శ్రీనివాస్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలంలోని పాలెం గ్రామానికి చెందిన లతీఫ్(70) మంగళవారం బస్టాండ్‌లోనికి వస్తుండగా హైదరాబాద్ నుంచి కొల్లాపూర్‌కు వెళ్లే ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని 108 అంబులెన్స్‌లో నాగర్‌కర్నూల్ జిల్లా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ లతీఫ్ మృతి చెందాడు. సంఘటనపై కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

కరెంట్ షాక్‌తో పాడి ఆవులు..

కోడేరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, కోడేరు మండల కేంద్రానికి చెందిన గొల్ల పోడెండ్ల వెంకటయ్యకు చెందిన రెండు పాడి ఆవులు కరెంట్ షాక్‌తో చనిపోయాయి. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. వెంకటయ్యకు చెందిన పాడి ఆవులు మంగళవారం పొలంలోని బావిలో నీరు తాగేందుకు వెళ్లాయి. అప్పటికే బావిలో విద్యుత్ తీగలు తెగిపడి ఉండటంతో అవి విద్యుదాఘాతానికి గురై మృతి చెందాయి. వాటి విలువ లక్ష రూపాయలకు పైగా ఉంటుందని బాధితుడు తెలిపారు.

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

మహబూబ్‌నగర్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : భార్య వదిలేసి వెళ్లిపోవడంతో మనస్తాపానికి గురైన వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే ఎస్ఐ అక్బర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి... మహబూబ్‌నగర్ జిల్లా సీసీ కుంట మండలానికి చెందిన జానయ్య (42) భార్య నాలుగు నెలల క్రితం అతడిని వదిలేసి వెళ్లిపోయింది. అప్పటి నుంచి మనో వేదనకు గురైన ఆయన సోమవారం రాత్రి బండమీదిపల్లి శివారులో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. మంగళవారం ఉదయం స్థానికులు మృతదేహాన్ని గమనించి రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే ఎస్ఐ తెలిపారు.

అన్నదాతకు యంత్రసాయం

- ఐదేళ్ల క్రితం నిలిచిపోయిన 'వ్యవసాయ యాంత్రీకరణ'
- పథకాన్ని పునరుద్ధరించనున్నట్లు ప్రభుత్వ ప్రకటన
- రైతుల్లో చిగురిస్తున్న ఆశలు



రైతు పండుగలో ప్రదర్శించిన పురుగుల మందు పిచికారీ చేసే ఆధునిక డ్రోన్

పాలమూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ యాంత్రీకరణ పథకాన్ని పునరుద్ధరించనున్నట్లు ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడంతో రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. మారిన సాగు పద్ధతులు, కాడెద్దులు తగ్గిపోవడం, కూలీల కొరత, పెట్టుబడి కూడా ఎక్కువవడంతో రైతులు పంటల సాగు కోసం యంత్రాలను వాడటం తప్పనిసరిగా మారింది. కానీ ఐదేళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం వ్యవసాయ యాంత్రీకరణ పథకాన్ని నిలిపివేసింది. ఈ పథకానికి కేంద్ర ప్రభుత్వం నిధులను కేటాయిస్తున్నా, మ్యాచింగ్ గ్రాంట్‌గా రాష్ట్ర వాటా నిధులను విడుదల చేయక పోవడంతో పథకం అమలు కావడం లేదు. దీంతో రైతులకు సాగు భారంగా మారింది.

తప్పనిసరిగా మారిన యంత్రాల వినియోగం

కూలీల కొరతకు తోడు కూలి రేట్లు పెరగడంతో రైతులు వ్యవసాయానికి యంత్రాలను వినియోగించడం తప్పనిసరిగా మారింది. కానీ ప్రభుత్వం రాయితీపై యంత్ర పరికరాలను అందించడం లేదు. దీంతో అద్దెకు తీసుకోవాల్సి రావడం ఆర్థిక భారం అవుతోంది. ప్రస్తుతం పొలాన్ని ట్రాక్టర్‌తో దుక్కి దున్నేందుకు గంటకు రూ.1100, నారుమడికి రూ.1200, పల్లి విత్తనాలు వేసేందుకు గంటకు రూ.1100, పంటల కోత కోసం హార్వెస్టర్లకు గంటకు రూ.2500, యంత్రంతో ఒక గడ్డి కట్ట కట్టేందుకు రూ.35 తీసుకుంటున్నారు. రైతులకు రాయితీపై వ్యవసాయ పరికరాలు, యంత్రాలను అందిస్తే పెట్టుబడి ఖర్చు తగ్గి ఆదాయం పెరిగే అవకాశం ఉంటుంది. అయితే వ్యవసాయ యాంత్రీకరణ పథకాన్ని పునరుద్ధరించినట్లు ఇటీవల వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రకటించారు. కానీ ఇప్పటివరకు నిధులు విడుదల చేయకపోవడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు.

రైతు పండుగలో యంత్రాల ప్రదర్శన

మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో గత ఏడాది నవంబరు 28 నుంచి 30వ తేదీ వరకు ప్రభుత్వం రైతు పండుగ కార్యక్రమాన్ని నిర్వహించింది. వ్యవసాయ పరికరాలను, యంత్రాలను ప్రదర్శించారు. వాటి వినియోగం, ప్రయోజనాలను ఆయా సంస్థల ప్రతినిధులు రైతులకు వివరించారు. రైతు పండుగ చివరి రోజైన 30వ తేదీన నిర్వహించిన ముగింపు సభకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు, పలువురు మంత్రులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఆ తర్వాత వెంటనే ప్రభుత్వం రాయితీపై పరికరాలు, యంత్రాలను ఇస్తుందని ఆశించిన రైతులకు నిరాశే ఎదురయ్యింది. కనీసం వానాకాలం సాగుకైనా యంత్రాలను అందిస్తారా అన్న సందేహాలు వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వం నిధులు కేటాయిస్తే..



వ్యవసాయ యాంత్రీకరణ పథకానికి ప్రభుత్వం 2017 నుంచి నిధులు కేటాయించడం లేదు. ప్రస్తుతం ప్రభుత్వం నిధులు కేటాయించి, యంత్ర పరికరాలకు ధరలు నిర్ణయిస్తే రైతులకు రాయితీపై అందిస్తాం.

\- బి. వెంకటేశ్, జిల్లా వ్యవసాయాధికారి

తైవాన్ స్ప్రేయర్లు రాయితీపై ఇవ్వాలి



పాలమూరులో రైతుపండుగ తరువాత ప్రభుత్వం రాయితీతో యంత్రాలు ఇస్తుందని అనుకున్నాం. కానీ ఇప్పటివరకు అమలు చేయలేదు. కనీసం తైవాన్ స్ప్రేయర్లనైనా రాయితీపై అందించాలి. దీంతో సాగు ఖర్చు తగ్గుతుంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తగిన చర్యలు తీసుకోవాలి.

\- వెంకటయ్య, రైతు, హన్వాడ

జోగుళాంబ గద్వాల జిల్లాలో

పేకాట జోరు



గద్వాల క్రైం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లాలో పేకాట జోరుగా సాగుతోంది. ఈ వ్యవహారంపై పోలీసు అధికారులు కొంతకాలంగా ప్రత్యేక దృష్టి సారించి దాడులు చేస్తున్నారు. అయినా ఆట మాత్రం ఆగడం లేదు. పోలీసుల కళ్లు గప్పేందుకు తరచూ స్థావరాలను మారుస్తున్నారు. అందుకోసం కొందరు స్థానిక లాడ్జింగులను ఎంచుకుంటుండగా, మరికొందరు పట్టణ, గ్రామ శివారు, మారుమూల ప్రాంతాల్లో పేకాడుతున్నారు. వారికి పోలీసు శాఖలో కొందరు కిందిస్థాయి సిబ్బంది సహకరిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. పేకాట ఆడేందుకు కొందరు ఇతర జిల్లాల నుంచి కూడా ఇక్కడికి వస్తున్నట్లు తెలుస్తోంది.

జిల్లా వ్యాప్తంగా స్థావరాలు

జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో పేకాట స్థావరాలు కొనసాగుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. గట్టు మండలంలోని పెంచికలపాడు, మల్దకల్ మండలంలోని మద్దెలబండ శివార్లలో పేకాట జోరుగా సాగుతున్నట్లు తెలుస్తోంది. అలంపూర్ మండలంలోని ఉండవల్లి, ధరూర్ మండలంలోని పార్చెర్ల, గద్వాల మండల పరిధిలోని అనంతపురం, పూడూరు గుట్టలు, కొత్తపల్లి, గుంటిపల్లి శివారులోనూ పేకాట స్థావరాలు ఉన్నట్లు సమాచారం. అలాగే జిల్లా కేంద్రంలోని కొన్ని లాడ్జిలలో పేకాట యథేచ్ఛగా సాగుతున్నట్లు తెలుస్తోంది.

దాడులపై ముందే సమాచారం!

గద్వాల పట్టణంలోని జమ్మిచేడు సమీపంలోగల ఓ లాడ్జిలో పేకాట ఆడుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. పట్టణ ఎస్ఐ అక్కడికి చేరుకొనేలోగా కింది స్థాయి సిబ్బంది వారికి సమాచారం అందించడంతో పేకాట రాయుళ్లు పరారయ్యారు. ఈ సంఘటనలో గద్వాల మండలానికి చెందిన ఓ మాజీ నాయకుడు కూడా ఉన్నట్లు ఆరోపణలు వినిపించాయి. ఇటీవల అనంతపురం గుట్టల్లో కొందరు పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో, రూరల్ ఎస్ఐ శ్రీకాంత్ అక్కడికి వెళ్లారు. కానీ అప్పటికే కిందిస్థాయి సిబ్బందిలో ఒకరు సమాచారం ఇవ్వడంతో పేకాట రాయుళ్లు పరారవగా, ఒకడు మాత్రం పోలీసులకు దొరికాడు. అతడి ద్వారా పూర్తి వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు. గతంలో కర్నూల్ జిల్లాకు చెందిన ఓ వ్యక్తి ఇక్కడ పేకాట స్థావరాన్ని నిర్వహిస్తుండగా ఎస్పీ శ్రీనివాసరావు ఆదేశం మేరకు పోలీసులు దాడి చేశారు.

గత ఏడాది 263 మందిపై కేసులు

పేకాటకు సంబంధించి జిల్లాలో గత ఏడాది 35 ఘటనల్లో 263 మందిపై కేసులు నమోదయ్యాయి. ఈ ఏడాది ఇప్పటివరకు గేమింగ్ యాక్ట్ కింద ఆరు సంఘటనల్లో 35 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

పేకాటను అరికట్టేందుకు కృషి

జిల్లాలో పేకాటను అరికట్టేందుకు పూర్తి స్థాయిలో కృషి చేస్తున్నాం. ఇప్పటికే పలువురిపై కేసులు నమోదు చేశాం. పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందిన వెంటనే దాడులు చేసి, కేసులు నమోదు చేస్తున్నాం. సిబ్బందిని ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ, ప్రత్యేక నిఘా ఉంచుతున్నాం. జిల్లాలో పేకాటను పూర్తిగా అరికడతాం.

\- శ్రీనివాసరావు, ఎస్పీ, జోగుళాంబ గద్వాల

నేడు వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి రాక

- మహబూబ్‌నగర్, నారాయణపేట, వనపర్తి జిల్లాల్లో పర్యటన

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర రాజ నర్సింహ బుధవారం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 8.30 గంటలకు ఆయన హైదరాబాద్ నుంచి నుంచి బయలుదేరి 10 గంటలకు మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మండలంలోని కప్పెటకు చేరుకొని, గ్రామ సభలో పాల్గొంటారు. అనంతరం 11 గంటలకు దేవరకద్రకు చేరుకొని వంద పడకల ఆసుపత్రిని ప్రారంభిస్తారు. మధ్యాహ్నం 1.20 గంటలకు నారాయణపేట జిల్లా, మక్తల్ పట్టణంలో ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి నివాసానికి వెళ్తారు. అనంతరం పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో నూతనంగా ఏర్పాటు చేసిన డయాలసిస్ కేంద్రాన్ని పరిశీలిస్తారు. 1.30 గంటలకు 150 పడకల ఆసుపత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేయ నున్నారు. అక్కడి నుంచి బయలుదేరి 2.45 గంటలకు కాచ్వార్‌కు చేరుకొని, గ్రామ సభలో పాల్గొంటారు. కార్యక్రమం అనంతరం 3.45 గంటలకు వనపర్తి జిల్లా, అమరచింతకు చేరుకుంటారు. పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిని పరిశీలిస్తారు. 4.30 గంటలకు ఆత్మకూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన డయాలసిస్ కేంద్రాన్ని తనిఖీ చేయనున్నారు. సాయంకాలం 5.30 గంటలకు హైదరాబాద్‌కు బయలుదేరి వెళ్తారు.

పాలమూరు మార్కెట్లోకి

హ్యుందాయ్ 'క్రెటా ఎలక్ట్రిక్' కారు



హ్యుందాయ్ ఎలక్ట్రిక్ కారును ఆవిష్కరిస్తున్న ఎండీ గట్టు సిరిచందనరెడ్డి, డీటీవో ఎం.కిషన్ తదితరులు

పాలమూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ మార్కెట్లోకి హ్యుందాయ్ "క్రెటా ఎలక్ట్రిక్" కారు విడుదలయ్యింది. మహబూబ్‌నగర్ పట్టణంలోని ట్రెండ్ హ్యుందాయ్ షోరూంలో మంగళవారం డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ ఎం.కిషన్, మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ పి.రఘుకుమార్, ట్రెండ్ హ్యుందాయ్ మార్కెటింగ్ డైరెక్టర్ గట్టు సిరిచందనరెడ్డితో కలిసి "క్రెటా ఎలక్ట్రిక్" కారును ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎండీ గట్టు సిరిచందనరెడ్డి మాట్లాడుతూ ఈ కారులో అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన సరికొత్త 42 కేడబ్ల్యుహెచ్, 51.4 కేడబ్ల్యుహెచ్ గల అల్టిమేట్ బ్యాటరీతో భద్రతా సౌకర్యాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఒకసారి ఛార్జింగ్ పెడితే 473 కిలోమీటర్ల మైలేజ్ వస్తుందన్నారు. బ్యాటరీ 10 శాతం నుంచి 80 శాతం వరకు 58 నిమిషాల్లో (50 కేడబ్ల్యు), 39 నిమిషాల్లో (100 కేడబ్ల్యు) డీసీ చార్జింగ్ అవుతుందన్నారు. కేవలం 7.9 సెకన్లలో సున్నా నుంచి 100 కిలోమీటర్ల వేగానికి చేరుకుంటుందని చెప్పారు. వీ2ఎల్ (వెహికల్ టూ లోడ్) ఫీచర్ బ్యాటరీతో పాటు సెల్‌ఫోన్, ల్యాప్‌టాప్‌లను చార్జింగ్ చేసుకోవచ్చని చెప్పారు. 17 ఇంచుల ఏరో అల్లాయ్ వీల్స్ లెవెల్-2, అడ్వాన్స్ డ్రైవర్ అసిస్టెంట్ సిస్టమ్, 70 ప్లస్ స్టాండర్డ్ సేఫ్టీ ఫ్యూచర్లు ఉన్నట్లు తెలిపారు. డ్యూయల్ టోన్ రంగుల్లో లభిస్తోందన్నారు. కారు ప్రారంభ ధర రూ.17.99 లక్షల నుంచి రూ. 23.50 లక్షల వరకు ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో సేల్స్ మేనేజర్ హర్షవర్ధన్ రెడ్డి, సర్వీస్ మేనేజర్ మహమ్మద్ వసీం, కస్టమర్లు పాల్గొన్నారు.

ముగ్గురు సైబర్ నేరస్థుల అరెస్ట్

- రూ. 4 కోట్లు కాజేసిన ముఠాలో సభ్యులుగా గుర్తింపు
- రూ. 30 లక్షల విలువైన కారు, ఎక్స్‌కవేటర్ స్వాధీనం

వనపర్తి క్రైమ్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : ధని లోన్ యాప్ పేరుతో ప్రజలను మోసం చేస్తున్న సైబర్ నేరస్థుల ముఠాలోని ముగ్గురు సభ్యులను బాధితుల ఫిర్యాదు మేరకు అరెస్ట్ చేసినట్లు సైబర్ క్రైమ్ డీఎస్పీ రత్నం తెలిపారు. వనపర్తి జిల్లా కేంద్రంలోని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కొన్ని నెలలుగా అమాయక ప్రజలను ఆసరాగా చేసుకొని ఆన్‌లైన్‌లో రూ. నాలుగు కోట్లు కాజేసిన సైబర్ ముఠాలోని నిందితులు ఒక్కొక్కరిని బాధితుల ఫిర్యాదు మేరకు అరెస్టు చేస్తున్నట్లు తెలిపారు. గోపాల్‌పేట మండలం పొలికె పాడు గ్రామానికి చెందిన కావలి శివుడు, మండ్ల వెంకటేశ్‌లు బావ బామ్మర్దులు, ఇందులో వెంకటేశ్‌కు ఒక వ్యక్తి ఫోన్ చేసి ధని లోన్ యాప్‌లో లోన్ పొందేందుకు మీకు అర్హత ఉన్నదని, ఏమైనా అవసరం ఉన్నదా అని అడిగాడు. వెంటనే వెంకటేశ్ అవసరం ఉన్నదని చెప్పగా వివరాలు తీసుకున్నాడు. లోన్ మంజూరు అయ్యిందని, మీకు లోన్ డబ్బులు అకౌంట్‌లో జమ కావాలంటే ఇన్సూరెన్స్, జీఎస్టీ, టీడీఎస్, ప్రాసెసింగ్ ఛార్జీలు ముందుగానే చెల్లించాలని సూచించగా ఒప్పుకున్నాడు. సైబర్ నేరగాళ్ల సూచనల మేరకు గత నవంబరు 29వ తేదీన విడతల వారీగా వారు పంపిన క్యూ ఆర్ కోడ్‌లకు ఫోన్ పే ద్వారా రూ. 5,250, రూ. 2,250, రూ. 9,435, రూ. 5,000, రూ. 5,200 ఇలా మొత్తం రూ. 32,135 పంపించాడు. వెంటనే అనుమానం వచ్చి సైబర్ పోర్టల్ ద్వారా 1930 నెంబర్‌కు ఫోన్ చేయగా వారి సూచన మేరకు గోపాల్ పేట పోలీస్ స్టేషన్‌లో వెంకటేశ్ బావ శివుడు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు. తనతో పాటు గోపాల్‌పేట ఎస్ఐ రవి ప్రకాష్, సీఐ కృష్ణయ్య, ఎస్ఐ నరేశ్, సైబర్ సెక్యూరిటీ సిబ్బంది ఉమ్మడిగా దర్యాప్తు చేసి రూ. నాలుగు కోట్లు కాజేసిన ముఠా లో 55 మంది సైబర్ నేరగాళ్లను గుర్తించినట్లు తెలిపారు. అందులో మహబూబ్‌నగర్ జిల్లా మూసాపేట మండలం సుర్తితుండవి తండాకు చెందిన మూడావత్ నరేశ్ నాయక్, మూడావత్ వెంకటేశ్ నాయక్, మూడావత్ చందు నాయక్‌లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. వీరి నుంచి రూ. 30 లక్షల విలువైన బ్రీజా కారు, ఎక్స్‌కవేటర్, నాలుగు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ రత్నం తెలిపారు. వీరితో పాటు ముఠాలోని సభ్యులందరూ కోల్‌కతా, ఢిల్లీ, పాట్నాలో ఉంటున్న పంకజ్, అంకిత్, వారి అనుచరులు చెప్పిన విధంగా సైబర్ నేరాలకు పాల్పడుతూ అమాయక ప్రజలను మోసం చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో సీఐ కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

బాల కార్మికుడి గుర్తింపు

- యజమానిపై కేసు నమోదు

ఖిల్లాఘణపురం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా ఖిల్లాఘణపురం మండల కేంద్రంలో ఆపరేషన్ స్మైల్ అధికారులు ఓ బాల కార్మికుడిని గుర్తించి, యజమానిపై కేసు నమోదు చేశారు. లేబర్ అధికారి మహమ్మద్ రఫీ ఆధ్వర్యంలో తనిఖీ చేస్తుండగా బస్టాండ్ సమీపంలో డిష్ కేబుల్ లాగుతున్న 13 ఏళ్ల బాలుడిని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. డిష్ కేబుల్ సంస్థ యజమాని సాధిక్ పాషాపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ సత్యనారాయణ గౌడ్ తెలిపారు. బాలుడిని జిల్లా కేంద్రంలోని చైల్డ్ వెల్ఫేర్ కమిటీ కార్యాలయానికి తరలించినట్లు లేబర్ అధికారి మహ్మద్ రఫీ తెలిపారు. తనిఖీల్లో ఎస్ఐ మహమ్మద్ అహ్మద్ , కానిస్టేబుళ్లు శ్రీనివాసులు, శ్వేత, ఆర్‌డీఎస్ హరికృష్ణ, రవి రాజు పాల్గొన్నారు.

క్రేన్‌పై నుంచి కింద పడి జెన్‌కో ఉద్యోగికి తీవ్ర గాయాలు

- హైదరాబాద్‌లోని యశోదా ఆసుపత్రికి తరలింపు

దోమలపెంట, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : క్రేన్‌పై నుంచి కింద పడి జెన్‌కో ఉద్యోగి (ఆర్టిజన్) తీవ్రంగా గాయపడ్డాడు. తోటి ఉద్యోగులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లా, అమ్రాబాద్ మండలం, ఈగలపెంట జెన్‌కో కాలనీలో మంగళవారం విద్యుత్ తీగలకు తాకుతున్న చెట్ల కొమ్మలను తొలగింపు పని చేపట్టారు. ఉద్యోగి గుర్రం రాములు క్రేన్‌కు జూలా కట్టుకొని కొమ్మలను నరుకుతుండగా, క్రేన్ హుక్ నుంచి తాడు జారిపోయింది. దీంతో అతడు 20 అడుగుల పై నుంచి కింద పడటంతో, కాళ్లు, చేతులు విరిగిపోయాయి. ఛాతీ, ముఖానికి తీవ్ర గాయాలయ్యాయి. తోటి ఉద్యోగులు, కార్మికులు అతడిని వెంటనే జెన్‌కో ఆసుపత్రికి తీసుకెళ్లారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని యశోదా ఆసుపత్రికి తరలించారు. ఈ విషయంపై కాలనీ ఇన్‌చార్జి ఈఈ రమేశ్‌ను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా ప్రమాదం జరిగింది వాస్తవమని తెలిపారు. బాధితుడికి మెరుగైన చికిత్స చేయిస్తామని చెప్పారు. అయితే అధికారులు సరైన రక్షణ చర్యలు కల్పించకపోవడం, సేఫ్టీ బెల్టు లేకుండా పని చేయించడం వల్లే ప్రమాదం జరిగిందని తోటి ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నాం

● గ్రామ కార్యదర్శి శ్యామ్‌సుందర్‌రెడ్డి



మరికల్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మరికల్ పట్టణ ప్రజల సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు కృషి చేస్తున్నానని గ్రామ కార్యదర్శి శ్యామ్‌సుందర్‌రెడ్డి పేర్కొన్నారు. గ్రామంలో ఏ సమస్య ఉన్నా ఫిర్యాదు చేయవచ్చన్నారు. మంగళవారం 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూలో ఆయన పలు విషయాలను వెల్లడించారు.

గ్రామ సభలో ఏ సమస్యలపై దరఖాస్తులు ఎక్కువగా వచ్చాయి?

ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్ కార్డులపై అధికంగా దరఖాస్తులు వస్తున్నాయి.

గ్రామంలో చెత్త సేకరణ సరిగానే జరుగుతోందా?

చెత్తసేకరణ వాహనాలను ప్రతీ ఇంటికి పంపిస్తున్నాం. గ్రామంలో ఎక్కడా మురికి, చెత్త లేకుండా చూస్తున్నాం.

నీటి లీకేజీల పరిస్థితి ఏమిటి?

మంచినీటి పైపులైన్ లీకేజీలు అయిన వెంటనే మరమ్మతులు చేస్తున్నాం. నిధులు లేకున్నా ఎప్పటికప్పుడు స్థానికంగా ఏ చిన్న సమస్య ఉన్నా వెంటనే పరిష్కరిస్తున్నాం.

ఇంటి పన్నులు వసూలు చేస్తున్నారా?

గ్రామంలో 60 శాతం ఇంటి పన్నులు వసూలు అవుతున్నాయి.

పేట యార్డులో
ధాన్యం క్రయ విక్రయాలు

నారాయణపేట, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట వ్యవసాయ మార్కెట్ యార్డుకు మంగళవారం ధాన్యం విక్రయానికి వచ్చింది. ధాన్యం ధరలు ఈ విధంగా ఉన్నాయి.

ధాన్యం	క్వింటాల్	గరిష్ట	కనిష్ట
		(రూపాయలలో)	
వేరుశనగ	987.60	5,859	3,060
వరి సోన	24.60	2,449	2,340
ఎర్ర కందులు	1538.11	7,902	6,066
తెల్ల కందులు	373.42	8,216	7,055
అలసందలు	0.98	6,839	6,839

న్యూస్ బాక్స్

నేడు డయల్ యువర్ డీఎం

నారాయణపేట న్యూటౌన్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట, కోస్గి ఆర్టీసీ డిపో పరిధిలో ప్రయాణికుల సమస్యల పరిష్కారం కోసం మంగళవారం ఉదయం 11 నుంచి 12 గంటల వరకు డయల్ యువర్ డీఎం నిర్వహించనున్నామని డిపో మేనేజర్ లావణ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రయాణికులు 7382826293 నెంబర్‌కు ఫోన్ చేసి సలహాలు, సూచనలు తెలియజేయాలని కోరారు.

ఘనంగా ఎల్లమ్మ జాతర

నారాయణపేట న్యూటౌన్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): పట్టణ శివారు దామరగిద్ద రోడ్‌లో వెలసిన మహాపురే ఎల్లమ్మ దేవత జాతర ఉత్సవాలు స్వకుళసాలి సమాజ్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించుకున్నారు. అంతకుముందు దుర్గమ్మ మందిర్ నుంచి పల్లకీ సేవ నిర్వహించారు. కార్యక్రమంలో సమాజ్ అధ్యక్షుడు రమేష్ జరంగ్, విజయ్ ఎడికే, కృష్ణ గుండా, అంబరీనాథ్, కిశోర్‌ధోత్రె, హంసరాజ్, మెలిగిరి కాంబ్లె తదితరులున్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

దామరగిద్ద, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడుతాయని ఎంఈవో కృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని క్యాతన్‌పల్లి జడ్పీహెచ్‌ఎస్‌లో భూమిక ఉమెన్స్ కలెక్టివ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు నిర్వహించిన క్రీడా పోటీల కార్యక్రమానికి ఆయన హాజరై, మాట్లాడారు. విద్యార్థులకు కబడ్డీ, ఖోఖో, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి జిల్లా స్థాయిలో బహుమతులు ఇస్తామని సంస్థ కోఆర్డినేటర్లు నాగమ్మ, పద్మ తెలిపారు. కార్యక్రమంలో మోహన్, కృష్ణయ్య, ఆయా గ్రామాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బడిబయటి పిల్లల గుర్తింపు

మరికల్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కన్మనూర్ గ్రామంలో బడి మానేసిన విద్యార్థులను మంగళవారం సీఆర్‌పీ శివకుమార్ గుర్తించారు. డ్రాప్ అవుట్ విద్యార్థుల వివరాలు తెలుసుకొని వారి ఇంటికెళ్లి తల్లిదండ్రులకు అవగాహన కల్పించి పిల్లలను బడికి పంపించాలని కోరారు. ఉపాధ్యాయుడు రవీందర్‌రెడ్డి తదితరులున్నారు.

ఎమ్మార్పీఎస్ మండల కమిటీ ఎన్నిక

దామరగిద్ద, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు గోనిపాటి కళ్యాణ్‌మాదిగ ఆధ్వర్యంలో మంగళవారం సమితి మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బొంబాయి రాములు, అధికార ప్రతినిధిగా బర్ల ఆనంద్‌మాదిగ, ప్రధాన కార్యదర్శిగా మాలేం నరేందర్, కార్యదర్శులుగా బాలప్ప, మహాదేవప్ప తదితరులను ఎన్నుకున్నారు. అనంతరం కళ్యాణ్‌మాదిగ మాట్లాడుతూ ఫిబ్రవరి ఏడున హైదరాబాద్‌లో నిర్వహించనున్న లక్ష డప్పులు.. వెయ్యి గొంతుకుల మహా ప్రదర్శనను విజయవంతం చేయాలని కోరారు. జడ్పీటీసీ మాజీ సభ్యుడు రవీందర్‌నాథ్, మాజీ ఎంపీపీ బక్క నర్సప్ప ఉన్నారు.

ఆదర్శంగా ఉండాల్సిన అధికారులే
అడ్డదారి తొక్కితే ఎలా.?

- విద్యుత్ ఏడీ నూతన భవన నిర్మాణానికి మీటర్ లేకుండా విద్యుత్ వాడకం
- ఏడీ కార్యాలయం పక్కనే సాగుతున్న నిర్మాణ పనులు
- కాంట్రాక్టర్‌తో అధికారులు కుమ్మక్కయ్యారన్న చర్చ

కోస్గి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు ఆదర్శంగా నిలవాల్సిన అధికారులు అడ్డదారి తొక్కుతూ విద్యుత్ కార్యాలయ ఆవరణలోనే నూతనంగా నిర్మిస్తున్న ఏడీ కార్యాలయ భవన నిర్మాణానికి విద్యుత్ మీటర్ లేకుండా విద్యుత్‌ను వాడుతున్నారు. సామాన్య ప్రజలు మీటర్ లేకుండా వాడితే వారిపై కేసులు నమోదు చేస్తున్న విద్యుత్ అధికారులు మరి తామెందుకు నిబంధనలు పాటించడం లేదన్న చర్చ సర్వత్రా కొనసాగుతోంది. గత ఆరు నెలలుగా స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ ఆవరణలో ఏడీ కార్యాలయానికి నూతన భవనం మంజూరు కావడంతో పనులు సాగుతున్నాయి. అందరిలాగే కాంట్రాక్టర్ నిబంధనల ప్రకారం విద్యుత్ మీటర్ బిగించుకొని కార్యాలయ నిర్మాణ పనులకు విద్యుత్ వాడాలి కానీ ఇక్కడ కాంట్రాక్టర్ అధికారులతో కుమ్మక్కై ఎలాంటి విద్యుత్ మీటర్ లేకుండా విద్యుత్ వాడుతున్నాడు. స్థానిక ఏడీ సుధారాణి నిత్యం ఈ భవనం ముందునుంచే వెళ్తున్నారు కానీ ఇక్కడ మీటర్ లేకుండా విద్యుత్ ఎలా వాడుతున్నారని ఏనాడు అడిగిన పాపాన పోలేదు. ఇప్పటికైనా జిల్లా విద్యుత్ ఉన్నతాధికారులు స్పందించి సామాన్యులకు వర్తించే షరతులే కాంట్రాక్టర్లకు వర్తిస్తాయని హెచ్చరించి నూతన భవన నిర్మాణానికి విద్యుత్ మీటర్ బిగించాలని పలువురు కోరుతున్నారు.



కోస్గి ఏడీ కార్యాలయంలో విద్యుత్ మీటర్ లేకుండా నిర్మిస్తున్న ఏడీ నూతన కార్యాలయం

నా దృష్టికి రాలేదు.. పరిశీలించి చర్యలు తీసుకుంటా

ఈ విషయం నా దృష్టికి రాలేదు. ఏడీ కార్యాలయ నిర్మాణం కాబట్టి నేను చూడలేదు. నేను పరిశీలించి చర్యలు తీసుకుంటా. మీటర్ లేకుండా విద్యుత్ వాడకం చేస్తే నేను కాంట్రాక్టర్‌తో డీడీ కట్టించి మీటర్ బిగిస్తా.

- వెంకటేష్, ఏఈ



కోస్గి మునిసిపాలిటీలోని తొమ్మిదవ వార్డులో ఏర్పాటు చేసిన గ్రామసభలో మాట్లాడుతున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వార్ల విజయ్‌కుమార్



ఊట్కూర్ మండలం అమీన్‌పూర్ గ్రామసభలో లబ్ధిదారుల వివరాలు చదువుతున్న పంచాయతీ కార్యదర్శి అశోక్

ప్రభుత్వ పథకాల అమలు నిరంతర ప్రక్రియ

- నారాయణపేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి
- పేదలకు సంక్షేమ ఫలాలు అందించేందుకే ప్రజాపాలన
- మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి
- ప్రారంభమైన గ్రామసభలు



పేట ఐదో వార్డులో ఏర్పాటుచేసిన గ్రామసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి



మక్తల్ పట్టణంలోని ఒకటవ వార్డులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

నారాయణపేట టౌన్/నారాయణపేట రూరల్/మక్తల్/మక్తల్ రూరల్/మాగనూరు/కృష్ణ/కొత్తపల్లి/నర్వ/మరికల్/కోస్గి రూరల్/ఊట్కూర్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాల అమలు నిరంతర ప్రక్రియ అని పేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఏడు, ఐదవ వార్డుల్లో ప్రజాపాలన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కలెక్టర్ సిక్తా పట్నాయక్‌తో కలిసి ప్రారంభించారు. ఐదవ వార్డులో ఏర్పాటు చేసిన వార్డు సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్‌కార్డుల జారీ, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలు అర్హులైన వారందరికి వర్తిస్తాయన్నారు. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. పథకాల అమలుకోసం తహసీల్దార్, ఎంపీడీవో, మునిసిపల్ కార్యాలయాల్లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశామన్నారు. ఈనెల 26న నాలుగు కొత్త పథకాలను సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించనున్నట్లు తెలిపారు. మునిసిపల్ చైర్‌పర్సన్ గందె అనసూయ, మార్కెట్ చైర్మన్ సదాశివారెడ్డి, కమిషనర్ సునీత, కౌన్సిలర్ ఎండీ.సలీం తదితరులు పాల్గొన్నారు.

అదేవిధంగా నారాయణపేట మండలంలోని కొల్లంపల్లి, కోటకొండ, శేర్నపల్లి, సింగారం, భైరంకొండ, చిన్నజట్రం, అప్పక్‌పల్లి గ్రామాల్లో మంగళవారం గ్రామసభలు ప్రారంభమయ్యాయి. గ్రామసభల్లో రేషన్ కార్డుల కోసం 332, ఇందిరమ్మ ఇళ్ల కోసం 120, ఆత్మీయ భరోసా కోసం 25 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీవో సుదర్శన్ తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు, గ్రామ ప్రత్యేకాధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మక్తల్ మునిసిపాలిటీ పరిధిలోని ఒకటవ వార్డుతో పాటు, మండలంలోని కర్ని, మాగనూరు మండలం మందిపల్లి, కృష్ణ మండలం చేగుంట గ్రామంలో నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభల్లో ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి పాల్గొన్నారు. మక్తల్ ఒకటో వార్డులో ఆయన మాట్లాడుతూ అర్హులైన పేద ప్రజలందరికీ సంక్షేమ ఫలాలు అందించేందుకే ప్రజాపాలన కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని ఆయన పేర్కొన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు ఆరు గ్యారెంటీలు అమలు చేసి తీరుతామన్నారు. కౌన్సిలర్ అఖిల రాజశేఖర్‌రెడ్డి, జడ్పీటీసీ మాజీ సభ్యుడు లక్ష్మారెడ్డి, కట్టసురేష్‌కుమార్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గణేష్‌కుమార్, కర్నిలో జడ్పీటీసీ మాజీ సభ్యుడు లక్ష్మారెడ్డి, ఎంపీడీవో రమేష్, మార్కెట్ డైరెక్టర్ రంజిత్‌రెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు చిన్నరంగప్ప, మందిపల్లి, అడవి సత్యారం, కొల్పూరు, గజరందొడ్డి గ్రామాల్లో ట్రైనీ కలెక్టర్, మాగనూరు తహసీల్దార్ గిరిమానరుల, డీటీ సురేష్‌కుమార్, ఎంపీవో విజయలక్ష్మి, ఆర్ఐ శ్రీశైలం, చేగుంట లో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. గూడెబల్లూరు, ఖాన్‌దొడ్డి, గురుజాల గ్రామాల్లో తహసీల్దార్ బి.వెంకటేష్, ఎంపీడీవో జానయ్య, ఏవో సుదర్శన్‌గౌడ్, పీఆర్ ఏఈ మారుతి, రెవెన్యూ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, మాజీ ప్రజా ప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

నేలపై కూర్చున్న కలెక్టర్

కొత్తపల్లి మండలంలోని భూనీడు, దుప్పట్ఘట్టు, ఎక్కమెడు, లింగల్‌చెడ్ గ్రామాల్లో మంగళవారం గ్రామసభలు జరిగాయి. దుప్పట్ఘట్టులో గ్రామసభ జరుగుతుండగా కలెక్టర్ హాజరయ్యారు. గ్రామస్థులు కింద కూర్చోవడంతో కలెక్టర్ సైతం నేలపై కూర్చున్నారు. అర్హుల జాబితాను ఆర్డీవో చదివి వినిపించారు. ఎవరూ అభ్యంతరం చెప్పకపోవడంతో కలెక్టర్ మాట్లాడారు. తహసీల్దార్ జయరాములు, పంచాయతీ కార్యదర్శులు రఫీ, క్రాంతి, రెవెన్యూ సిబ్బంది, ఆయా గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

నర్వ మండల కేంద్రంతో పాటు, లంకాల, పెద్దకడ్మూర్, ఉందేకోడ్ గ్రామాల్లో ప్రజాపాలన కార్యక్రమాలు సజావుగా జరిగాయి. పెద్దకడ్మూర్ గ్రామంలో జరిగిన ప్రజాపాలన గ్రామసభలో అదనపు కలెక్టర్ బెన్‌షాలం పాల్గొన్నారు. ఆయా కార్యక్రమాల్లో తహసీల్దార్ మల్‌రెడ్డి, ఎంపీడీవో శ్రీనివాసులు, డీటీ శ్రీనివాసులు, ఎంపీవో రాఘవేందర్, ఏవో అఖిలారెడ్డిలు సర్వే జాబితాలను చదివి వినిపించారు.

మరికల్ మండలం పల్లెగడ్డ, తీలేరు, రాకొండ, మరికల్ గ్రామాల్లో మంగళవారం గ్రామసభలు నిర్వహించారు. ఆయా సభల్లో అధికారులు ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. జడ్పీ సీఈవో భాగ్యలక్ష్మి, ఎంపీడీవో కొండన్న, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కోస్గి మునిసిపాలిటీలోని తొమ్మిదవ వార్డులో ఏర్పాటు చేసిన ప్రజాపాలన గ్రామ సభలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వార్ల విజయ్‌కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ నాగరాజు, మాజీ సర్పంచ్ నాగులపల్లి నరేందర్, వార్డు మెంబర్లు, నాయకులు పాల్గొన్నారు. ముశ్రీఫా, ముంగిమళ్ళ, చెన్నారం గ్రామాల్లో తహసీల్దార్ శ్రీనివాసులు అధ్యక్షతన గ్రామసభలు నిర్వహించారు. బిజ్జారం, మీర్జాపూర్, కొత్తపల్లి గ్రామాల్లో ఏర్పాటుచేసిన గ్రామసభలో ఎంపీడీవో శ్రీధర్ పాల్గొన్నారు. సర్జఖాన్‌పేట్, నాచారం గ్రామాల్లో ఏవో రామకృష్ణ, గుండుమాల్ మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో ప్రత్యేకాధికారి ఆనంద్‌కిశోర్, భక్తిమళ్ళ, బలభద్రాయపల్లి గ్రామాల్లో ఏవో రేష్మారెడ్డి అధ్యక్షతన గ్రామసభలు నిర్వహించారు. కార్యక్రమాల్లో ఆర్ఐ లింగారెడ్డి, ఏఈవో వినోద్, పీఏసీఎస్ చైర్మన్ భీంరెడ్డి, ఎంపీవో వేణుగోపాల్‌రెడ్డి, గ్రామ కార్యదర్శి సాయిప్రకాష్‌రెడ్డి, నాయకులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఊట్కూర్ మండలంలోని అమీన్‌పూర్, పగిడిమారి గ్రామాల్లో ఎంపీడీవో ధనుంజయ్‌గౌడ్, కొల్లూర్ సమీస్తాపూర్ గ్రామాల్లో తహసీల్దార్ చింత రవి, పెద్దజట్రం, అవుసులోన్‌పల్లి గ్రామాల్లో టీం లీడర్ ఎంపీవో ఎంఎల్ఎన్ రాజు, తిప్రస్‌పల్లి, ఓబ్లాపూర్ గ్రామాల్లో ఏవో గణేష్‌రెడ్డిల ఆధ్వర్యంలో జరిగిన గ్రామ సభల్లో ఎంపికైన లబ్ధిదారుల జాబితాను అధికారులు చదివి వినిపించారు. పేర్లు రాని వారు నూతనంగా దరఖాస్తులు అందించారు. గ్రామసభల్లో టీం సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

అధికారులను నిలదీసిన కాంగ్రెస్ నాయకుడు

ధన్వాడ : భూమి లేని వారందరికి ఆత్మీయ భరోసాను ఇవ్వాలని, కేవలం ఉపాధి హామీ పథకంలో పనిచేసిన వారికే ఆత్మీయ భరోసా ఏమిటని.. మేము కూడా ఓట్లు వేశామంటు కాంగ్రెస్ పార్టీ నాయకుడు అచ్చిబాబు అధికారులను నిలదీశారు. ధన్వాడ పంచాయతీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన గ్రామసభలో అచ్చిబాబు అధికారులతో గొడవకు దిగారు. అర్హత ఉన్న వారందరికి పథకాలు ఇవ్వాలంటు డిమాండ్ చేశారు. ఎంపీడీవో సాయిప్రకాష్ పాల్గొన్నారు.

కానుకుర్తి గ్రామాన్ని మండలంగా ప్రకటించాలి

దామరగిద్ద, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల వాగ్దానంలో భాగంగా మండల పరిధిలోని కానుకుర్తి గ్రామాన్ని మండలంగా ప్రకటించాలని ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డికి మంగళవారం చుట్టుపక్కల గ్రామాల నాయకులు వినతిపత్రం అందజేశారు. స్పందించిన ఆమె పరిశీలిస్తామని పేర్కొన్నారు. ఎంపీటీసీ మాజీ సభ్యుడు మొనపురం బస్వరాజ్, ఓంప్రకాష్, పుష్పల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మల్లికార్జున్ తదితరులున్నారు.

పాఠశాలల అభివృద్ధికి కృషి చేద్దాం

నారాయణపేట టౌన్ : పాఠశాలల అభివృద్ధికి సమష్టిగా కృషి చేద్దామని ఎమ్మెల్యే పర్ణికారెడ్డి అన్నారు. స్థానిక సీవీఆర్ భవన్‌లో మంగళవారం పీఆర్టీయూటీఎస్ ఆధ్వర్యంలో రూపొందించిన డైరీలను, వాల్ క్యాలెండర్‌లను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడు యాద్గీర్ జనార్దన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, రఘువీర్, జహీరొద్దీన్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు వరలక్ష్మి, సబాసుల్తానా, విశ్వనాథ్ పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

నారాయణపేట : స్థానిక సీవీఆర్ భవన్‌లో మంగళవారం ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి విశ్రాంత ఉద్యోగుల నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మనోహర్‌ప్రసాద్‌గౌడ్, సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

బాలభవన్‌గా అప్‌గ్రేడ్ చేయాలి

పేటలోని బాలకేంద్రాన్ని బాలభవన్‌గా అప్‌గ్రేడ్ చేసి, వేతనాలు పెంచాలని మంగళవారం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డికి శిక్షకులు, సిబ్బంది వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సంగనర్సిములు, మహిపాల్‌రెడ్డి, వసంత్, జ్ఞానామృత తదితరులున్నారు.

రెండోరోజు కొనసాగిన ఆర్టిజన్‌ల రిలే దీక్షలు

నారాయణపేట న్యూటౌన్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): తమను కన్వర్షన్ చేయాలని డిమాండ్ చేస్తూ టీవీజేఏసీ ఆధ్వర్యంలో నారాయణపేట విద్యుత్ శాఖ కార్యాలయం వద్ద ఆర్టిజన్ కార్మికులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారం రెండో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఆర్టిజన్ కార్మిక సంఘం నాయకుడు రాఘవేందర్‌గౌడ్ మాట్లాడుతూ ప్రభుత్వం తమ విద్యార్హతను బట్టి పదోన్నతులు కల్పించాలన్నారు. రమేష్, సురేష్‌కుమార్, దిల్‌దార్, మక్బూల్, భీంషప్ప, రమేష్‌గౌడ్, భాస్కర్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, అంజి, ఆంజనేయులు ఉన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

నారాయణపేట న్యూటౌన్/ఊట్కూర్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): నారాయణపేటలో మంగళవారం కేంద్ర ప్రభుత్వ న్యాయవాది రఘువీర్‌యాదవ్, బీజేపీ లీగల్ సెల్ జిల్లా కన్వీనర్ నందునామాజీ, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు భరత్‌కుమార్‌లు పెద్దజట్రం గ్రామానికి చెందిన శివకుమార్‌కు రూ.39 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును అందించారు. కార్యక్రమంలో కిరణ్‌కుమార్, మహబుబ్‌అలీ, సోమేశ్వర్‌రెడ్డి తదితరులున్నారు.

డిగ్రీ కళాశాల ప్రారంభానికి ఆహ్వానం ఇవ్వకపోవడం సరికాదు

ధన్వాడ, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ధన్వాడ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధి కోసం స్థానిక ప్రజాప్రతినిధులు సైతం ఉన్నారని, ఇప్పుడు మాజీలుగా మారినంత మాత్రాన ప్రారంభోత్సవానికి ఆహ్వానం ఇవ్వకపోవడం సరైంది కాదని బీజేపీ జిల్లా నాయకుడు సుంకు ఉమేష్‌కుమార్‌గుప్తా అన్నారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ డిగ్రీ కళాశాలలో విద్యార్థులను చేర్పించడం కోసం గతంలో నిర్వహించిన కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధుల భాగస్వామ్యం ఉందన్నారు. కేవలం అధికార పార్టీ నాయకుల వరకే పాల్గొని ప్రారంభోత్సవాలు చేసుకోవడం సమంజసం కాదన్నారు.

మక్తల్ ప్రభుత్వ ఆసుపత్రిని పరిశీలించిన కలెక్టర్

మక్తల్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మక్తల్ పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని మంగళవారం సాయంత్రం కలెక్టర్ సిక్తాపట్నాయక్ పరిశీలించారు. 22న వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహ మక్తల్ మండలంలోని కాచ్‌వార్‌లో నిర్వహించనున్న ప్రజాపాలన సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. అలాగే మక్తల్ ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించనున్న నేపథ్యంలో కలెక్టర్, ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ఆసుపత్రిలో డయాలసిస్ సెంటర్ ఏర్పాటుకు సంబంధించిన వివరాలను డీఎంహెచ్‌వో సౌభాగ్యలక్ష్మి, ఆసుపత్రి సమన్వయకర్త మల్లికార్జున్‌తో చర్చించి తగు సూచనలు చేశారు. అంతకుముందు కలెక్టర్ ఎమ్మెల్యేతో కలిసి పట్టణ శివారులోని సర్వే నెం.916/2, 917/2 సర్వే నెంబర్లలో 150 పడకల ఆసుపత్రికి ప్రతిపాదించిన స్థలాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సతీష్‌కుమార్, మునిసిపల్ కమిషనర్ భోగేశ్వర్లు, ఆర్ఐ రాములు, సర్వేయర్లు, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

మల్టీ లెవల్ మార్కెటింగ్ స్కీంలతో అప్రమత్తంగా ఉండాలి

- ఎస్పీ యోగేష్‌గౌతమ్

నారాయణపేట, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మోసపూరిత వాగ్దానాలు, ప్రకటనలతో మోసాలకు పాల్పడుతున్న మల్టీ లెవల్ మార్కెటింగ్ స్కీంలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ యోగేష్‌గౌతమ్ మంగళవారం కోరారు. ప్రజల సొమ్ము దోచుకునేందుకు సైబర్ నేరగాళ్లు రోజురోజుకు కొత్త పోకడలతో ప్రజల బలహీనతలను ఆసరాగా చేసుకొని పెట్టుబడి చేసుకునేందుకు కొత్త పంథాలు ప్రయోగిస్తున్నారన్నారు. మల్టీలెవల్ మార్కెటింగ్ స్కీంలు, పిరమిడ్ లాంటి స్కీంలు ద్వారా ప్రజల డబ్బును దోచేస్తున్నారన్నారు. ప్రజలు డబ్బుకు ఆశపడి సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడకూడదన్నారు. మోసపోతే 1930 టోల్‌ఫ్రీ నెంబర్‌కు ఫిర్యాదు చేయాలన్నారు.

ఉపాధ్యాయుల కొరత తీర్చాలి

నారాయణపేటరూరల్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బోయిన్‌పల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత తీర్చాలని విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. మంగళవారం పాఠశాలలో అప్పక్ ఐడీ సమావేశంలో భాగంగా విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాలకు చేరుకుని ఉపాధ్యాయులకు విన్నవించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలలో ఆరు తరగతులకు గాను ముగ్గురు ఉపాధ్యాయులు మాత్రమే ఉన్నారని, అందులో ఒక ఉపాధ్యాయుడిని లక్ష్మీపూర్‌కు డిప్యుటేషన్‌పై పంపించడం సమంజసం కాదన్నారు. లక్ష్మీపూర్‌కు పంపిన ఉపాధ్యాయురాలిని తిరిగి పాఠశాలకు పంపాలని డిమాండ్ చేశారు. తల్లిదండ్రులు బోయ భాస్కర్, రమేశ్, హన్మంతు, సత్యమ్మ ఉన్నారు.

సాంకేతికతపై విద్యార్థులకు అవగాహన

నారాయణపేట టౌన్/నారాయణపేట రూరల్/ఊట్కూర్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించి సాంకేతికతపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా సోహమ్ అకాడమీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని స్ఫూర్తి డిగ్రీ కళాశాల, పేట మండలం జాజాపూర్ జడ్పీ ఉన్నత పాఠశాలతో పాటు జిల్లాలోని మరికల్, ధన్వాడ, చిన్నపొర్ల, ఉత్తనూర్, బొమ్మన్‌పాడ్, ఊట్కూర్ మండలం బాలుర ఉన్నత పాఠశాలల్లో మంగళవారం రోబోటిక్స్ ఇన్ అకాడమిక్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో విద్యార్థులు రోబోటిక్స్ ప్రాథమిక సూత్రాలను నేర్చుకున్నారు. విద్యార్థులకు ధ్రువపత్రాలతో పాటు విద్యాసంస్థలకు రోబోటిక్స్ కిట్స్‌ను పంపిణీ చేశారు. శిక్షణ అనంతరం విద్యార్థులు ఏడాది వరకు ఇన్నోవేషన్ చాలెంజ్‌లలో పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. అకాడమీ బృందం సభ్యులు రాహుల్, హెచ్‌ఎంలు భారతి, మురళీధర్, జిల్లా సైన్స్ అధికారి భానుప్రకాశ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రేపు టెన్నికాయిట్ ఎంపికలు

మక్తల్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మక్తల్ పట్టణంలోని సాయిజ్యోతి ఉన్నత పాఠశాల వద్ద ఈనెల 23న టెన్నికాయిట్ పోటీలు నిర్వహించనున్నామని విశ్రాంత పీఈటీ బి.గోపాలం, టెన్నికాయిట్ జిల్లా ప్రధాన కార్యదర్శి దీప తెలిపారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ ఒక్కో పాఠశాల నుంచి ఇద్దరు బాలురు, ఇద్దరు బాలికలు బోనఫైడ్‌తో హాజరు కావాలన్నారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను ఈ నెల 26న హైదరాబాద్ అంబర్‌పేట్‌లో జరిగే పోటీలకు పంపిస్తామన్నారు. పీఈటీలు అంబ్రేష్, రమేష్, దామోదర్ తదితరులున్నారు.

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి

నారాయణపేట, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): పెండింగ్ బిల్లులు విడుదల చేసి, రిటైర్మెంట్ వయస్సు పెంపు యోచనను విరమించుకోవాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కే.రవికుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో నారాయణపేట జిల్లా ఆఫీసు బేరర్స్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ జులై 2023 నుంచి పీఆర్‌సీ అమలు చేసి బకాయి పడిన నాలుగు వాయిదాల కరువు భత్యాన్ని వెంటనే విడుదల చేయాలన్నారు. కస్తూర్బా, ఆశ్రమ పాఠశాలల కాంట్రాక్టు ఉద్యోగులకు మినిమం టైం స్కేల్ ఇవ్వాలన్నారు. రాష్ట్ర బడ్జెట్‌లో విద్యకు 15 శాతం నిధులు కేటాయించాలన్నారు. కార్యక్రమంలో కిష్టయ్య, వెంకటస్వామి, బాలాజీ, భీమయ్య, కృష్ణగౌడ్, రవికుమార్, సాయప్ప, మోహన్, వెంకటేష్ తదితరులున్నారు.

ఆశాలకు రూ.18 వేల వేతనం ఇవ్వాలి

- అప్పక్‌పల్లి నుంచి కలెక్టరేట్ వరకు వర్కర్ల పాదయాత్ర



కలెక్టరేట్ వద్ద సీఐటీయూ నాయకులతో కలిసి ఆశ వర్కర్ల నిరసన

నారాయణపేట, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ఆశాలకు రూ.18 వేల వేతనం అమలు చేయాలని కోరుతూ మంగళవారం మండలంలోని గడ్డమీది అప్పక్‌పల్లి నుంచి నారాయణపేట కలెక్టరేట్ వరకు ఆశ వర్కర్లు పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి, కార్యదర్శి బాల్‌రామ్, ఆశ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు బాలమణిలు ప్రసంగించారు. కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా ఆశాలకు రూ.18 వేల వేతనం ఫిక్స్ చేయాలన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ ఉద్యోగ భద్రత కల్పించాలని, ఏఎన్ఎం ట్రైనింగ్ పూర్తి చేసిన వారికి పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టరేట్ ఏవో జయసుధకు వినతిపత్రం అందించారు. గోపాల్, జ్యోషి, గౌరమ్మ, శ్రీదేవి, రేణుక, విజయలక్ష్మి, మమత, నర్సమ్మ, రమాదేవి, భాగ్యమ్మ, నర్మద, రాధిక, శాంతమ్మ, స్వాతి, లక్ష్మి, శశికళ, అరుణ, లావణ్య తదితరులున్నారు.

గోఆధారిత వ్యవసాయంపై అవగాహన సదస్సు



గో ఆధారిత వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న రాజవర్ధన్‌రెడ్డి

మక్తల్‌రూరల్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మక్తల్ మండలం దాసర్‌దొడ్డి రైల్వేస్టేషన్ ఎదురుగా ఉన్న రవీందర్‌రెడ్డి వ్యవసాయ క్షేత్రంలో మంగళవారం గోఆధారిత వ్యవసాయంపై అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా శిక్షణ ప్రముఖ్ రాజవర్ధన్‌రెడ్డి ప్రకృతి వ్యవసాయంలో ఉన్న ప్రయోజనాల గురించి రైతులకు వివరించారు. క్షేత్ర గోసేవ ప్రముఖ్ ఆకుతోట రామారావు, జిల్లా గోసేవ ప్రముఖ్ రంగుల ముకుందరెడ్డి, బీజేపీ నాయకులు కొండయ్య, జి.శరణప్ప, రైతులు, నిర్వాహకులు రఘుప్రసన్న భట్, రవీందర్‌రెడ్డి తదితరులున్నారు.

అభయాంజనేయస్వామి దేవాలయ నిర్మాణానికి కృషి



శిఖర నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న డాక్టర్ రాజ్‌కుమార్‌రెడ్డి

దామరగిద్ద, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): అభయాంజనేయస్వామి దేవాలయ నిర్మాణానికి కృషి చేస్తున్నామని భీష్మరాజ్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ కె.రాజ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని కానుకుర్తి గ్రామంలో పురాతన అభయాంజనేయస్వామి దేవాలయ పునఃనిర్మాణంలో భాగంగా దేవాలయ శిఖర నిర్మాణానికి మంగళవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శిఖర నిర్మాణానికి ఫౌండేషన్ తరపున రూ.11 లక్షలు కేటాయించామన్నారు. దేవాలయ నిర్వాహకులు, ఆవుటి బస్వరాజ్, ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.